రాక్షస స్త్రీలు

సుంకరి రాంప్రసాద్

జైలు ఆవరణ సందడిగా వుంది.

ఉదయ ఫలహారం కోసం ఖైదీలు బారులుతీర్చి నిలుచున్నారు. లే ఎండలో వారి చేతులలోని సిల్వర్ గిన్నెలు తళ తళ మెరుస్తున్నాయి.

అప్పటికే టిఫిన్ కలెక్టు చేసుకొన్న కొందరు ఖైదీలు చెట్లక్రింద కూర్చొని, కబుర్లు చెప్పుకుంటూ ఫలహారం చేస్తున్నారు.

అది.... మహిళా నేరస్తుల నుంచే జైలు కావడంచేత తెల్లని చీరలలో తళ తళ లాడిపోతున్నారు ఆ ఖైదీలు, తెల్లని జైలు యూనిఫారాలలో ఆ స్త్రీలు ఖైదీల్లా కన్పించటంలేదు.

ఆశ్రమవాటికలోని ముని కన్యల్లా ఉన్నారు.

హరితవనంలో విహరిస్తోన్న శ్వేత విహంగాల్లా ఉన్నారు.

దూరంగా ఒక మూలనున్న బాదంచెట్టు క్రింద

ఒంటరిగా కూర్చుని టిఫిన్ చేస్తున్న సుగుణ, సన్నగా అడుగుల చప్పుడు వినిపించడంతో తల యెత్తి చూసింది.

ఎదురుగా ఒక అందమైన యువతి నిలబడి వుంది. పాతికేళ్ళ వయసుంటుంది ఆమెకు.

తెల్లని ఛాయ. అందమైన కోలముఖం. తీర్చిదిద్దినట్లున్న కనుముక్కు తీరు. చూడగానే ముద్దుపెట్టుకోవా అనిపించేంతటి ముద్దయిన ఎర్రని పెదవులు. నాజూకయిన శరీరంతో మగాడిని కవ్వించే అందమైన వంపులు.

ఆ జైలు యూనిఫారమే లేకుంటే, ఆమె ఒక ఖైదీ అని యెవరైనా చెప్పినా నమ్మబుద్ధికాదు.

ఆ యువతి చనువుగా సుగుణ ప్రక్క నేలమీద కూర్చొంది. ఆమెవంక ఇబ్బందిగా చూసింది సుగుణ.

సుగుణకు ఒంటరితనమంటే యిష్టం.

ఆ జైలులోనికి వచ్చి కొన్ని నెలలు కావస్తున్నా, యెంతో అవసరం ఉంటే తప్ప ఆమె యెవరితోనూ మాట్లాడలేదు. చివరకు భోజనం చేసేటప్పుడు కూడా అందరికీ దూరంగా, ఒంటరిగా కూర్చుంటుంది.

క్రొత్తలో ఆమె ప్రవర్తన మిగిలిన ఖైదీలకు ఎబ్బెట్టుగా అనిపించినా- కాలక్రమేణా వారుకూడా ఆమెను పట్టించుకోవడం మానేశారు.

ఇప్పుడు....ఎవరో ఒక అపరిచిత యువతి వచ్చి చనువుగా తన ప్రక్కన కూర్చొనేసరికి, ఆమెవంక ఆశ్చర్యంగా చూసింది సుగుణ. ఆ యువతి పలకరింపుగా నవ్వింది.

"నా పేరు సంధ్య." అంది ఆ యువతి సుగుణతో సంభాషణను ప్రారంభిస్తూ.

సుగుణ ఆమెవంక అనాసక్తంగా చూసింది.

"మీ పేరు సుగుణ."

తన పేరు ఆమెకెలా తెలిసిందా అని ఆశ్చర్య పోయింది సుగుణ. సంధ్య పెదవులపై మరోసారి దర హాసం విరిసింది.

నవ్వటం అందరి సొత్తు. కాని, అందంగా నవ్వటం మాత్రం కొందరికే సాధ్యపడుతుంది. అలా అందంగా నవ్వగలిగే కొద్దిమందిలో సంధ్య ఒకతె.

మనుషుల దృష్టిని ఆకట్టుకొనే నవ్వు అది.... అప్రయత్నంగానే ఆమెవంక చూసింది సుగుణ.

"ముప్ఫయి యేళ్ళ వయసులో మీరిలా జైలుపా లవటం, అందునా యావజ్జీవ కారాగార శిక్షను అనుభ వించాల్సి రావటం నిజంగా మీ దురదృష్టం సుగుణా!"

ఆమె మాటలను నిర్లిప్తంగా వింటూ కూర్చుంది సుగుణ. ఆమెకు యిలాంటి సానుభూతి వాక్యాలు వినటం మామూలై పోయింది.

"కాని, మీరు కావాలనుకుంటే మీ దురదృష్టం అదృష్టంగా మారుతుంది.

ఈ జైలు నుండి బయటపడి హాయిగా బ్రతక వచ్చు...." అంది సంధ్య ఆమె కళ్ళలోనికి సూటిగా చూస్తూ.

అంతవరకూ మౌనంగా కూర్చున్న సంధ్య పెదవి విప్పింది.

"ఈ జైలునుండి తప్పించుకొని పారిపోవటమే మీ ఆలోచన అయితే అది సాధ్యపడే విషయం కాదు. ఈ జైలుకు చాలా పటిష్టమైన కాపలా వుంది.

అదీగాక, ఆ రిస్క్‌ను నేను తీసుకోదలచుకోలేదు. తప్పించుకొనే ప్రయత్నంలో పట్టుబడితే........ మళ్ళీ

దానిలో క్రొత్త శిక్ష. ఎందుకొచ్చిన రిస్క్?"

"మీరు తప్పించుకోవాల్సిన అవసరంలేదు సుగుణా! న్యాయస్థానమే మిమ్మల్ని నిర్దోషులుగా ఎంచి విడుదల చేస్తుంది."

ఆమె మాటలకు ఉలిక్కిపడింది సుగుణ. ఆశ్చర్యం, ఆశ, ఆనందం ఒకేసారి ముప్పిరిగొనగా ఆమె గొంతు చిన్నగా వణికింది.

"ఎలా?" అంది ఆమె ఆత్రంగా.

"అది నేను చెప్పను సుగుణా! చేసి చూపిస్తాను. మీరు నాతో ఒక అంగీకారానికి వస్తే!"

"ఏమిటి కావాలి మీకు?"

"మీ ఆస్తిలో సగం వాటా. అదీ క్యాష్ రూపంలో.

"సగం వాటానా...." అంది సుగుణ....నీళ్ళు నములుతూ.

"అవును సుగుణా. నీ ఆస్తి విలువ....అంటే నీచే హత్యగావింపబడ్డ నీ భర్త ద్వారా సంక్రమించిన ఆస్థి విలువ హీనంగా ఇరవై లక్షలు ఉంటుంది. అందులో సగం, అంటే పదిలక్షలు.

ఐ వాంట్ దోజ్ టెన్ లాక్స్!

పదిలక్షలంటే యెక్కువ మొత్తమే కావచ్చు. కాని పన్నెండేళ్ళ జైలుజీవిత క్లేశం తప్పిపోవాలంటే, కటకటాల మధ్య కరిగిపోవాల్సిన మీ యవ్వనాన్ని, మీరు ఆనందంగా అనుభవించాలనుకుంటే మీరా మాత్రం మూల్యం చెల్లించక తప్పదు సుగుణా!

జైలునుండి వచ్చాక మీరు అనుభవిద్దామన్నా అప్పుడు పోయిన వయసు మీకు తిరిగిరాదు కదా!

విలువైనది కాలం. దాని విలువ అమూల్యం. అలాంటి కాలానికి నే పడుతున్న మూల్యం కేవలం పదిలక్షలు."

ఆమె మాటలను అయిష్టంగానే తలాడించింది సుగుణ....

'పదిలక్షలు వదులుకోవడం కష్టమే. కాని యావజ్జీవ కారాగార శిక్ష నుండి బయటపడటానికి ఆ మాత్రం ఖర్చు తప్పదేమో!'

అందుకే సుగుణ ఆ ప్రపోజల్ ను అంగీకరించింది.

"దట్స్ గుడ్ సుగుణా!

"అయితే ఇక నా ప్రయత్నంలో ఉంటాను" అంటూ లేచి నిలబడింది సంధ్య.

రెండడుగులు ముందుకు వేసి టక్కున ఆగింది వెను తిరిగి చూసి....

"ఒక్క మాట సుగుణా!

జైలునుండి విడుదలయ్యాక. నన్ను మోసం చేయాలనే ఆలోచన కలలో కూడా రానీయకు.

జైలునుండి తప్పించగలుగుతున్న నేను నిన్ను మళ్ళీ సులువుగా జైలుకు పంపించగలననే మాట పైసల నిజం నీకు గుర్తుంటుందనే ఆశిస్తాను.

గుడ్ లక్! వస్తాను" అంటూ వడి వడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయింది సంధ్య.

అప్రతిభురాలై ఆమె వంకే చూస్తూ నిలుచుండిపోయింది సుగుణ.

2

ప్రియా ఫెర్టిలైజర్ కంపెనీకి మేనేజింగ్ డైరక్టర్ గోపాలరావు.

డ్యూటీ ఈజ్ డివైన్ అని త్రికరణశుద్ధిగా నమ్మిన మనిషతడు.

ముప్ఫయిఏళ్ళ వయసులోనే భార్య పోయినా, మళ్ళీ పెళ్ళి మాట తల పెట్టకుండా పదేళ్ళపాటు ఒంటరిగానే బ్రతికాడు.

అతడి దురదృష్టం అతడికో వారసుడ్ని ఇవ్వకుండానే కన్నుమూసింది అతడి భార్య.

ఒంటరితనాన్ని మరచిపోవడానికి అహోరాత్రాలూ కంపెనీలోనే శ్రమించేవాడతడు. అతడి కృషి, శ్రమా అతడికి మేనేజింగ్ డైరెక్టర్ స్థానాన్ని సంపాదించి పెట్టాయి.

కాని. యిప్పుడు........యీ నలభై అయిదేళ్ళ వయసులో మళ్ళీ అతడిని ఒంటరితనం వెంటాడటం ప్రారంభించింది.

నిజమే నేమో! మనిషికి బాల్యంలోనూ, వృద్ధాప్యంలోనూ తోడు కావాలంటారు.

అతడు తను కలలుగన్న స్థాయికి ఎదిగాడు. డబ్బూ, హోదా అన్నీ సంపాదించాడు. కాని అవి అనుభవించడానికి, అతనితో ఆనందాన్ని పాలుపంచుకోవడానికి నా అనేవారు ఎవరూ లేరు.

సాయంత్రం ఒంటరిగా లాన్‌లో కూర్చుని టీ త్రాగుతూ....తన కిష్టమయిన శ్రీశ్రీ గీతాన్ని టేప్ రికార్డర్‌లో వింటున్నప్పుడు....

"చీకటి ముసిరిన ఏకాంతంలో
నేనున్నానని నిండుగా పలికే
తోడొకరుండిన అదే భాగ్యమూ
అదే స్వర్గమూ!

మనసున మనసై
బ్రతుకున బ్రతుకై .... ॥తోడొక॥

ఆ పాటలోని భావం సూటిగా అతడి గుండెలను తాకేది. తను ఒంటరి నన్న భావం అతడిని కదిలించి వేసేది.

'నిజమే! జీవితపు రెండవ అంకంలోనికి అడుగుపెడుతున్న ఈ దశలో తనకూ ఒక తోడు కావాలి!' అనుకున్నాడతడు దీర్ఘంగా నిట్టూరుస్తూ.

అలాంటి దశలో అతడి జీవితంలోనికి ప్రవేశించింది సుగుణ. షీ ఈజ్ ఎ ఫాస్టు గర్ల్!

సుగుణ క్రొత్తగా చేరిన అతడి పర్సనల్ సెక్రటరీ. డ్యూటీలో చేరిన కొద్ది కాలానికే, ఒక్క ఆఫీసు పనులే కాక, అతడి స్వంత పనులను కూడా చక్కదిద్దేటంత సాన్నిహిత్యాన్ని సంపాదించింది ఆమె.

అతడిప్పుడు రవ్వంత ఆప్యాయత కోసం ఆత్రంగా యెదురుచూస్తోన్నాడు. అది సుగుణలో లభించింది అతడికి.

“అదే ప్రేమంటే” అంది ఆమె.

“కాబోలు” ననుకున్నాడు అతడు.

“ప్రేమకు వయసుతో సంబంధం లేదు. పడుచు క్లియోపాత్రా, ముసలి సీజర్ ను ప్రేమించిందంటే.... కారణం....అతడిలోని హీరోయిజాన్ని చూసి కాదూ!” అంది ఆమె, అతడి బుగ్గలను పెదవులతో రాస్తూ.

“నిజమే సుమా!” అనుకున్నాడతడు మైకంగా.

అందమయిన ఇరవై యేళ్ళ అమ్మాయి “నీవే నా హీరోవి” అంటే కదలని మగాడుంటాడా? అందులో ఏభయి యేళ్ళు దగ్గరపడుతున్న వయస్సులో.

వారి ప్రేమ పెళ్ళిగా మారింది.

ఒక్క తాళిబొట్టుతో ...అతడి ఆజ్ఞలను పాటించే సెక్రటరీ, అతడిని ఆజ్ఞాపించ గలిగే భార్య అయి పోయింది.

దినాలు క్షణాలుగా గడిచిపోయాయి. ఇప్పుడు గోపాలరావుకు జీవితం యెంతో తృప్తిగా వుంది.

కాని.... అన్నీ మనిషి అనుకున్నట్లుగా జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది?

ఓ రోజు రాత్రి ...కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ ఉంది, ఆలస్యంగా వస్తానని భార్యకు చెప్పి, కంపెనీకి వెళ్ళాడు అతడు.

కాని, అనుకోని పరిస్థితులవల్ల, మీటింగ్ కాన్సిల్ కావటంతో వెంటనే యింటికి వచ్చేశాడు. ఆత్రంగా తమ బెడ్రూమ్ను సమీపించబోయిన అతడు....లోపల నుండి యేదో మగ గొంతు వినిపించేసరికి టక్కున ఆగి పోయాడు.

కీ హోల్ నుండి లోపలకు తొంగి చూశాడు.

అంతే!

లోపలి దృశ్యం విద్యుద్ఘాతంలా అతడి మనసును తాకింది.

తమ బెడ్ పై, తన భార్య ఎవరో పరాయిపురుషునితో నగ్నంగా....

పట్టలేని కోపంలో అతడు తలుపులను విసురుగా తన్నాడు. "సుగుణా!" అంటూ గావుకేక వేశాడు.

ఆ కేకతో లోపలివారు ఉలిక్కిపడ్డారు. ఆ యువకుడు గబ గబా బట్టలు వేసుకొని, తలుపు తెరిచి, అడ్డంగా వున్న గోపాలరావును ప్రక్కకు తోసేసి, పరుగెత్తు

కుంటూ పారిపోయాడు.

సుగుణ మాత్రం మంచంమీద అలాగే నగ్నంగానే పడుకుంది. ఆమె ముఖంలో భయం కూడా లేదు.

“ఎవడు వాడు?” అన్నాడు గోపాలరావు కళ్ళతో నిప్పులను కురిపిస్తూ.

“అతడా....నా బాయ్‌ఫ్రెండ్ ఆంటోనీ” అంది ఆమె నవ్వుతూ.

“యూ బిచ్! ఇంకా నవ్వుతున్నావా? సిగ్గులేదూ!” అన్నాడతడు ఆవేశంగా.

ఆమె మరోసారి సన్నగా నవ్వింది.

“నేను మన పెళ్ళికి ముందే చెప్పాను. నీవు సీజర్, నేను క్లియోపాత్రా అని. మరి మన మధ్యకు ఏంటోనీ వస్తే కోప్పడతారేం?

సీజర్, ఏంటోనీల నిద్దరినీ క్లియోపాత్ర ప్రేమించలేదా? నేనూ అంతే! ఐ వాంట్ యూ బోత్!”

ఆమె ఒక్కొక్క మాట తన గుండెను తూట్లు పొడుస్తోంటే పట్టలేని కోపంతో అతడు చాచి ఆమె చెంపపై కొట్టాడు.

ఆమె ముఖం చూడలేక, గిరుక్కున వెనుతిరిగి ఆ గదిలో నుండి బయటకు వెళ్ళిపోయాడు.

‘మంచి మనిషికో మాట. మంచి గొడ్డుకో దెబ్బ’ అన్నారు. కాని ఆమె ఆ రెండింటి కన్నా నీచమైంది.

ఆస్తికోసం గోపాలరావును వలలో వేసుకొని పెళ్ళాడింది.

“కాని యిప్పుడు తన గుట్టు బయటపడింది కాబట్టి, తన భర్త తనకు విడాకులిస్తే....మళ్ళీ తన ప్లాట్‌ఫారం మీద పడాలి. అంతకు ముందే మేల్కొవాలి” అనుకుంది

ఆమె చెంపను తడుముకుంటూ.

తన ప్రియుడు ఆంటోనీకి వెంటనే కబురు పంపించింది ఆమె. ఆ రోజు రాత్రి చాలాసేపు తర్జనభర్జనలు పడ్డాక వారు ఒక నిర్ణయానికి వచ్చారు.

ఆంటోనీకి మాత్రం లోలోపల భయంగా వుంది. ఏవో చిన్న చిన్న నేరాలు మాత్రమే చేసేవాడతడు.

కాని, ఒక్కసారిగా 'హత్య' అనేసరికి అతడికి కాళ్ళూ, చేతులూ ఆడటంలేదు.

ఎంతో ధైర్యంగా, నిబ్బరంగా ఉన్నది సుగుణే! నిజానికి మగవారికన్నా ఆడవారిలోనే తెగింపు యెక్కువ ఉంటుంది. కాని, సమాజపు కట్టుబాట్లతో, ఆచారాల పేరుతో స్త్రీ బంధింపబడి.... ఆ మెళకువ నిగూఢమౌతూంది.

ఒక్కసారి ఆ కట్టుబాట్లను తెంచుకున్న స్త్రీ ఏమైనా చేయగల్గుతుంది. అందులో తప్పటడుగు పట్టుకడ్డ జారిణి ఎంతకయినా తెగిసుంది.

నిద్రపోతున్న గోపాలరావు గదిలోకి పిల్లుల్లా ప్రవేశించారు వారిద్దరూ. తలగడను అతని ముఖానికి అదిమి పెట్టి బలంగా నొక్కసాగాడు ఆంటోనీ. భర్త కాళ్ళూ చేతులనూ కదలకుండా పట్టుకుంది సుగుణ.

కేవలం కొద్ది నిముషాల పోరాటం తరువాత శాశ్వతంగా నిద్రపోయాడు గోపాలరావు.

పెరడులో గొయ్యి తీసి, అతడి శవాన్ని పాతిపెట్టారు వారు. రాయితో అతడి ముఖాన్ని పూర్తిగా చితుకగొట్టారు. ఇప్పుడు ఆ శవాన్ని యెవరయినా చూసినా దానిని పోల్చుకోలేరు.

తన భర్త యెక్కడికో కాంప్ కు వెళ్ళారని లోకాన్ని నమ్మించడానికి ప్రయత్నించింది ఆమె.

అయితే, సుగుణ తప్పటడుగు వేసింది అక్కడే. గోపాలరావు ఒక అనామకుడు కాడు. ఒక కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్.

పనంటే ప్రాణం యిచ్చే అలాంటి వ్యక్తి, ఎవ్వరికీ చెప్పకుండా అర్ధాంతరంగా యెక్కడికో వెళ్ళాడంటే యెవరు నమ్మినా, అతడు పనిచేస్తున్న కంపెనీ వారు నమ్మలేదు.

రెండురోజులు వెయిటు చేశారు వారు. కాని, గోపాలరావు దగ్గర నుండి కనీసం ఫోన్ అయినా రాకపోవడంతో, వారు పోలీస్ కంప్లైంట్ యిచ్చారు.

పోలీసులు రంగంలోకి దిగారు.

ఇన్స్పెక్టర్ జయంత్ పరిశోధన ప్రారంభించాడు. సుగుణను కలుసుకున్నాడతడు.

మూడు రోజులుగా భర్త కనిపించడం లేదన్న ఆదుర్దా కాని, కలవరం కాని మచ్చుకయినా ఆమెలో కనిపించలేదు అతడికి.

సుగుణను యెంత ప్రశ్నించినా అతనికి కావాల్సిన సమాచారం ఏమీ లభించలేదు.

'తన భర్త ఎక్కడకు వెళ్ళిందీ, ఏమయిందీ తెలియక తనే తల్లడిల్లిపోతున్నా'నంది ఆమె దీనంగా.

ఎందుకో ఆమె దుఃఖం అసహజంగా తోచింది అతడికి. ఇంట్లో పనివారిని ఒక్కొక్కరినీ పిలిచి ఎంక్వయిరీ ప్రారంభించాడతడు.

గూర్ఖాతో సహా అందరు పనివారూ తమ కేమీ తెలియదని చెప్పారు.

డబ్బు పాపిష్టి ద టూరు. సుగుణ యెర చూపిన డబ్బు ఆ పనిమనుషుల నోళ్ళు మూయించింది. అతడికి కేసు

విచిత్రంగా తోచింది.

'తాళికట్టిన భార్యకు తెలియదు. అహర్నిశలూ కాపలా ఉండే గూర్ఖాకూ తెలియదు. రాత్రి, పగలూ ఇంట్లోనే మసిలే పనివారికీ తెలియదు.

కాని....ఆ యింటి యజమాని మాత్రం ఉన్నట్లుండి అదృశ్యమయ్యాడు. చిత్రం కాదూ!'

అతడు ఆలోచిస్తోన్నాడు.

'ఇందులో ఎక్కడో ఏదో మర్మం ఉంది. కాని, నిజం దాయబడుతోంది.'

అతడు జీపును యెక్కి వెనుతిరిగాడు. సరిగ్గా అతడి జీపు మెయిన్ గేటు దాటే సమయంలో అతడిని కలుసుకున్నాడో వ్యక్తి.

అతడు....సీనయ్య.

గోపాలరావు యింట్లో పనిచేసే ముసలి నౌకరు. యజమాని ఉప్పు తిని బ్రతుకుతున్నానన్న విశ్వాసం అతడిలో యే మూలో కాస్త యెక్కువే వుంది. అందుకే అతడు సుగుణ చూపిన డబ్బు ఎరకు చిక్కి, పెదవి విప్పకుండా ఉండలేకపోయాడు.

"సుగుణకు ఎవరో యువకునితో అక్రమ సంబంధం ఉందని, అతడు యజమాని లేని సమయంలో తరచుగా ఆ యింటికి వస్తూండేవాడని, ఆ విషయంపైనే ఆ రాత్రి భార్యాభర్తల మధ్య పోట్లాట జరిగిందని" చెప్పాడు సీనయ్య

అయితే...ఆ రాత్రి తరువాత ఏం జరిగిందో మాత్రం అతడూ చెప్పలేకపోయాడు.

సీనయ్య చెప్పిన మాటలు ఇన్‌స్పెక్టర్‌లో క్రొత్త ఆలోచనలను రేపాయి.

'పరాయి మగవానితో భార్యకున్న అక్రమ సంబంధాన్ని కళ్ళారా చూశాడు గోపాలరావు.

ఆ షాక్‌ను తట్టుకోలేక, భార్యమీద అసహ్యంతో, జీవితంమీద విరక్తి కలిగి దేశాలు పట్టిపోయాడా?

లేకుంటే....

తన రహస్యం బయటపడిందన్న ఆవేశంలో తన ప్రియుని సహకారంతో భర్తను....సుగుణ హత్య చేసి ఉంటుందా?

అదే నిజమయితే మరి శవం?'

పోలీసు ఆలోచనలెప్పుడూ హత్యలూ, దొంగతనాల మీదే ఉంటాయి. అదృష్టవశాత్తూ ఇన్‌స్పెక్టర్ జయంత్ ఆలోచనలు ఈ కేసుకు సంబంధించినంత వరకూ సరైన ట్రాక్‌లో నడిచాయి.

అతడు వెంటనే పోలీసుకుక్కలను తెప్పించాడు. గోపాలరావు గదిలోని బట్టలను వాటికి వాసన చూపించి వదిలారు. అవి భవనం, తోట అంతా కలియ తిరిగి, చివరకు తోటలో ఒకచోట ఆగిపోయాయి.

ముక్కుపుటాలను ఎగబీలుస్తూ, కాలి గోళ్ళతో మట్టిని గోకసాగాయి. ఇన్‌స్పెక్టర్ వచ్చి ఆ స్థలాన్ని చూశాడు.

మిగిలిన నేలకూ, ఆ స్థలానికీ మధ్య ఏదో తేడా కనిపించింది అతడికి. అక్కడ మట్టి కాస్త పచ్చిగా, తడిగా గోయి తీసి, కప్పి పెట్టినట్లు అగుపిస్తుంది.

ఇన్‌స్పెక్టర్ ఆజ్ఞతో ఆ స్థలాన్ని త్రవ్వటం ప్రారంభించారు పోలీసులు. వారు ఎంతోసేపు త్రవ్వాల్సిన అవసరం లేకపోయింది.

నాలుగడుగుల లోతులో....

వెల్లకిలా పడున్న శవం కనిపించింది వారికి. శవం ముఖం అంతా చితికిపోయి, ఆ పైన చెదలు కొరికి, తిని వేయటంతో.... అది యెవరి శవమో పోల్చలేక పోయారు ఎవరూ.

కాని, ఒడ్డూ, పొడుగూ, శవం ఆకారాన్ని బట్టి, అది గోపాలరావు శవమే అని నిర్ధారించారు పోలీసులు.

శవాన్ని చెదలు కొరికి తినేయటంవలన వ్రేలిముద్రలు కూడా లభించలేదు వారికి. అక్కడ.... ఆ గోతి దగ్గర ఇద్దరు వ్యక్తుల అడుగుజాడలు మాత్రం లభించాయి.

అందులో ఒక జత కాలిముద్రలు సుగుణవి. స్టోర్ రూమ్‌లో పార, గునపం కనిపించాయి. కాని అవి శుభ్రంగా కడుగబడి వున్నాయి. కడగబడిన ఆ రెండింటి మీదా కొన్ని వ్రేలిముద్రలు లభించాయి.

ఆ వ్రేలిముద్రలు సుగుణవి.

భర్తను తన ప్రియుని సహాయంతో చంపిందన్న అభియోగంతో సుగుణపై చార్జిషీట్ ఫైలు చేయబడింది.

కోర్టులో ...

'తనకేమీ తెలియదనీ, తాను నిర్దోషిననీ' చెప్పింది సుగుణ ఏడుస్తూ!

అయితే గోతి దగ్గర ఆమె అడుగుల గుర్తులూ, గునపం పారపై ఆమె వ్రేలిముద్రలు ఎలా ఏర్పడ్డాయో ఆమె కన్విన్సింగ్‌గా చెప్పలేక పోయింది. షీహేడ్ నో ఆన్సర్స్.

ఆ శవం గోపాలరావుదే అని పోలీసులు నిర్ధారించటం చేత, గోపాలరావు మరణంవలన లాభం పొందుతున్న ఏకైక వ్యక్తి సుగుణ కావడంచేత—

ఆస్తికోసం భర్తను చంపిందన్న పోలీసుల అభి

యోగాన్ని కోర్టు విశ్వసించింది.

అన్నింటినీ మించి.... హత్యచేయబడ్డ రోజు రాత్రి.... గోపాలరావు జీవితంలో చివరిసారిగా డైరీలో వ్రాసుకున్న వాక్యాలు న్యాయస్థానాన్ని కన్విన్స్ చేశాయి.

పీపుల్స్ ఎగ్జిబిట్ 'డి' గా కోర్టువారి ముందు ఉంచబడ్డ ఆ డైరీలో....

'తన భార్య సుగుణను, పరాయి పురుషునితో నగ్నంగా తమ పడక గదిలోనే చూసిన క్షణంలో తను ఎంత క్షోభను అనుభవించినదీ వ్రాసాడు గోపాలరావు.

"ఆ క్షణంలో వారిద్దరినీ అక్కడికక్కడే నరికి పోగులు పెడదామన్న ఆవేశం వచ్చింది నాకు."

ఇవి గోపాలరావు డైరీలో వ్రాసుకున్న చివరి మాటలు.

సుగుణే భర్తను చంపిందన్న ఆరోపణకు ప్రత్యక్ష సాక్ష్యం లేకపోయినప్పటికీ, గోపాలరావును చంపే అవసరం ఆమెకు తప్ప యింకెవరికీ లేకపోవటంచేత, మిగిలిన సాక్ష్యాలు ఆమెకు ప్రతికూలంగా ఉండటంచేత న్యాయస్థానం ఆమెను ముద్దాయిగా ఎంచి, యావజ్జీవ కారాగార శిక్షను విధించింది.

అయితే.... ఈ హత్యలో సుగుణతోపాటు పాలు పంచుకున్న రెండవ వ్యక్తి .. ఆమె ప్రియుడు ఆంటోనీ మాత్రం అజ్ఞాతంలోనే ఉండిపోయాడు.

3

"ఏమ్మా? నీ కంటికి నేను వెధవలా కన్పిస్తున్నానా?" కోపంగా అన్నాడు లాయర్ గణపతిరావు.

"అదేమిటండీ అలా అంటారు?"

ఆశ్చర్యపోతూ అంది అతడి కెదురుగా కుషన్డ్

ఛైర్‌లో ఒద్దికగా కూర్చున్న యువతి.

"కాకుంటే ఏమిటట!

అది కేసా? దానిని నేను టేకప్ చేయాలా? కేసుల్లేని చెట్టుక్రింద ప్లీడరయినా ఆ కేసును టేకప్ చేస్తాడా!

అందులో ఒక కోర్టులో జడ్జిమెంట్ యిచ్చేశాక, ఓ ప్రక్క ముద్దాయి శిక్షను కూడా అనుభవించేస్తున్న ఈ కేసును.

మర్డర్ కేసంటే మాటలనుకున్నారా?

అయినా ఈ కేసులో యేముందని వాదించడానికి నా బొంద!" చిరుబురులాడాడు గణపతిరావు.

ఆమె చిన్నగా నవ్వింది.

"కేసు కష్టమైనదే లాయర్‌గారూ కాని, లక్ష రూపాయలంటే.....అది తక్కువ మొత్తమేమీ కాదుగా!"

"లక్షా!!" అతడు ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెట్టాడు.

'మై గుడ్‌నెస్! లక్ష. ఒక్క కేసుకు ఆమె ఆఫర్ చేస్తున్న ఫీజా ఒన్ లాక్!'

అతడు ఆశ్చర్యంలోనుండి ఇంకా తేరుకోలేదు. తాను వింటున్నది కలో, నిజమో అర్థంకాలేదు అతడికి.

ఆమె హాండ్ బ్యాగ్ తెరచి ఒక నోట్లకట్టను పైకి తీసి టేబిల్ మీద పెట్టింది.

"పదివేలు. మీ అడ్వాన్స్" అంది ఆమె మరోసారి చిన్నగా నవ్వుతూ.

తనతో ఎవరైనా ప్రాక్టికల్ జోక్ చేస్తున్నారన్న అనుమానం యేమైనా మిగిలి వుంటే అదంతా ఆ నోట్ల కట్టను చూడగానే అతనిలో నుండి పటాపంచలై పారిపోయింది.

ఆ నోట్లకట్టను ఆశగా అందుకొని డ్రాయర్‌లో పెట్టాడు.

"ఫీజా దేముంది లెండి. మీరు యిస్తారు. నేను తీసుకుంటాను. కాని, కేసులో మనకేమిటి ఛాన్సెస్ వున్నాయా అని ఆలోచస్తున్నాను" అన్నాడతడు నీళ్ళు నములుతూ.

"కేసు రజలుపై మీకు అనుమానం అక్కర్లేదు లాయర్ గారూ! మనం తప్పక గెలుస్తాం."

తనపై, తన శక్తి సామర్థ్యాలపై ఆమెకున్న నమ్మకానికి అతడు గర్వంగా ఫీలయ్యాడు.

"నిజమేనమ్మా. డిఫెన్స్ లాయర్ గణపతిరావు కేసును చేపట్టాడంటే, దానిని గెలిచి తీరతాడు.

కాని.... ఈ కేసులో యెక్కడా డిఫెన్స్‌కు తావున్నట్లు తోచడంలేదు.

కోడిగ్రుడ్డుకు ఈకలు పీకాలంటే...." నవ్వుతూ అన్నాడతడు.

"కోడిగ్రుడ్డుకు ఈకలను మొలిపించే బాధ్యత నాది లాయర్ గారూ!" అంది ఆమె నవ్వుతూ.

ఆమె మాటలకు అతడి పెదవులమీది నవ్వు మాయమయ్యింది. అతడి ముఖం మ్లానమయ్యింది.

'అంటే..ఆమె మొలిపించిన ఈకలను తాను కోర్టులో పీకాలా!'

ఉబికి వస్తున్న ఆవేశాన్ని యెలాగో అపుకున్నాడతడు.

'నిజమే! కోడిగ్రుడ్డుకు ఈకలు పీకడానికి లక్షరూపాయలు ఫీజునిచ్చే క్లయింట్‌తో దురుసుగా మాట్లాడం తెలివి తెలిసిన లాయర్ చేయాల్సిన పనికాదు.'

అతడికి ఒక్క విషయం స్పష్టంగా అర్థమవుతూంది.

ఆమెకు తనపై విశ్వాసం కన్న, ఆమెపై ఆమెకు విశ్వాసం ఎక్కువని.

ఆమె ఒక ఫైలును అతడికి అందించింది.

"ఇందులో ఆ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు విమెన్ కోర్టు హియరింగ్స్, ప్రాసిక్యూషన్ వారి కథనం....కోర్టు యిచ్చిన తీర్పు....అన్నీ డీటెయిల్డుగా టైపు చేయబడి వున్నాయి.

ఈ రోజు మీరు వాటిని బాగా స్టడీ చేయండి. రేపు మళ్ళీ మిమ్మల్ని ఇదే వేళకు కలుసుకుంటాను నేను."

మంత్ర ముగ్ధునిలా ఆమె మాటలను వింటూ ఆ ఫైలును అందుకున్నాడు గణపతిరావు.

ఆ యువతి....సంధ్య.

4

ట్రింగ్....ట్రింగ్....

కాలింగ్ బజరు మ్రోగింది.

అంతవరకూ అసహనంగా గదిలో పచార్లు చేస్తున్న నికల్సన్ ఆత్రంగా గది తలుపులు తెరిచాడు.

ఎదురుగా నిలబడ్డ యువతిని చూడగానే అతడి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"కాయా? పండా?" అడిగాడతడు ఆత్రంగా.

ఆమె తీయగా నవ్వింది.

'నే వేశ్యాక కాయ యెలా అవుతుంది?' అన్నట్లుంది ఆ నవ్వు.

అతడామె వంక గర్వంగా చూశాడు.

నాలుగు కళ్ళు రెండయిన వేళ....

ఛటాలున ఆమెను కౌగిలిలోనికి లాక్కొని గాఢంగా ఆమెను చుంబించాడతడు.

తాకింది పెదవిపైనా కందినవి మాత్రం చెక్కిళ్ళు. కన్నులు అరమోడ్పులయిన వేళ. ఒక తీయని అనుభూతి వింతైన పులకరింతై....ఆమె మేను సన్నగా కంపించింది.

రెండు నిముషాల తరువాత వారు కౌగిలినుండి విడివడ్డారు.

"థాంక్యూ" అన్నాడతడు నవ్వుతూ.

"థాంక్స్....ముద్దుకా? సుద్దుకా?" అంది ఆమె చిలిపిగా.

"రెండింటికీనూ" అన్నాడతడు ఆమె బుగ్గపై చిటిక వేస్తూ.

ఆమె వయ్యారంగా నడుచుకుంటూ వెళ్ళి బెడ్ మీద వెల్లకిలా పడుకుంది. తలుపుకు గడియ పెట్టి వచ్చి, అతడు కూడా ఆమె ప్రక్కనే మేను వాల్చాడు.

"ఏమిటో...., చూస్తూ, చూస్తూ లక్షరూపాయలను అప్పణంగా ఆ లాయర్‌కు అప్పజెప్పటం నాకేం నచ్చలేదు బాబూ!"

అతడి గుండెలపై తలవాల్చి గోముగా అంది ఆమె. అతడు చిరునవ్వు చిందించాడు.

"నిజం నికల్సన్!

కష్టపడి ఇంత పకడ్బందీగా ప్లాన్ వేస్తూంది మనం. కోర్టులో అతడేమి వాదించాలో 'ప్లాలు' యివ్వబోతోంది మనం.

అతడన్నట్లు....ఆఫ్టరాల్ కోర్టులో నిలబడి కోడి గుడ్డుకు ఈకలు పీకడానికి....లక్షరూపాయలా....నో.... ఇట్స్ టూ మచ్!"

చిన్నపిల్లలా ఉక్రోషంగా అంటున్న ఆమె వంక చూసి మరోసారి చిన్నగా నవ్వాడతడు.

"తప్పదు డార్లింగ్!

పది లక్షల కోసం ఒక లక్షను సేక్రిఫైజ్ చేయాలి. జస్ట్ ఫర్ సేఫ్టీ.

నిజమే! నీవన్నట్లు మనం యిచ్చిన పాఠాన్ని. కోర్టు హాల్లో అప్పజెప్పేందుకు....ప్రముఖ డిఫెన్సు లాయర్ గణపతిరావు అవసరంలేదు. ఏ చెట్టుకింద ప్లీడరయినా చాలు. సరిపోతాడు.

కాని....రేపు మనం కోర్టు హాల్లో ప్రవేశపెట్టబోయే సాక్ష్యాధారాలను గమనించిన వారెవరైనా, ఒక అనామక లాయర్ ఇంత అద్భుతమైన పరిశోధన, వాదన ఎలా చేయగలిగాడని ఆశ్చర్యపోతారు.

ఆశ్చర్యం అనుమానానికి, అనుమానం పరిశోధనకు దారితీస్తే.... తెర వెనుకనున్న మనం బయట పడతాం. అంతటితో ఇంతటి మన శ్రమా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది.

మన ప్లాను సర్వనాశనం అవుతుంది.

అదే.... ఈ కేసును గణపతిరావు వాదిస్తే....

బెమ్మిని తిమ్మిని చేయగల అంతటి ప్రముఖ డిఫెన్స్ లాయర్ మీద యెవరికీ అనుమానం రాదు. తెర వెనుక యెవరో ఉండి అతడికి సలహాలిస్తున్నారన్న ఆలోచన కూడా యెవరికీ రాదు. ఇదంతా అతడి ప్రతిభే అనుకుంటారు. అదే మనకు కావల్సింది.

అప్పుడే మనం ఆడబోయే నాటకం విజయవంత మౌతుంది.

అంతటి గణపతిరావు మనం చెప్పినట్లుగా ఆడాలంటే, మనం ఒక లక్షను వదులుకోక తప్పదు."

అతడి మాటలను శ్రద్ధగా వింది ఆమె. అతడివంక ప్రశంసాపూర్వకంగా చూసిందామె.

5

కోర్టు హాలు కిట కిట లాడుతోంది.

బోనులో దీనంగా నిలబడి ఉంది సుగుణ. ప్రేక్షకులు ఆమెవంక గుచ్చి గుచ్చి చూస్తున్నారు. వారి చూపులను భరిస్తూ నిలబడటం ఆమెకు కష్టంగా ఉంది.

కుర్చీలో నుండి మెల్లగా పైకి లేచాడు ప్రముఖ డిఫెన్స్ లాయర్ గణపతిరావు.

జడ్జివంక తిరిగి, చిన్నగా తల వంచి, అభివాదం చేసి, ఒక్కసారి చుట్టూ కలయజూసి, తరువాత చిన్నగా గొంతును సవరించుకున్నాడు.

“హానరబుల్ జస్టిస్ అండ్ జంటిల్ మెన్ ఆఫ్ ద జ్యూరీ....!

ఈ రోజు మీ అందరి సమక్షంలో ఈ బోనులో ముద్దాయిగా నిలుచుని ఉన్న నా క్లయింట్ శ్రీమతి సుగుణ నిర్దోషి.

ఆ సత్యాన్ని సహేతుకంగా, సాక్ష్యాధారాలతో సహా నేను నిరూపించగలను.

ఐ ప్రే ద కోర్టు టు అక్సెప్ట్ ద పిటీషన్ ఆఫ్ మై క్లయింట్ ఫర్ ద రీ ఆర్గ్యుమెంట్ ఇన్ దిస్ కేస్.”

అంతవరకూ మౌనంగా కూర్చున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామానుజం చటుక్కున లేచి నిలబడ్డాడు.

“ఐ అబ్జక్ట్ ఇట్ యువర్ ఆనర్! పూర్తి సాక్ష్యాధారాలతో ఈ ముద్దాయి దోషి అని నిరూపించబడ్డాక, ఒక న్యాయస్థానం ఆమె ‘దోషి’ అని నిర్ధారిస్తూ తీర్పును కూడా యిచ్చేశాక, ఓ ప్రక్క సదరు ముద్దాయి శిక్షను

కూడా అనుభవిస్తున్న ఈ సమయంలో....

మళ్ళీ ఆ కేసును తిరగతోడటంవలన అమూల్యమైన కోర్టువారి కాలాన్ని వృధాపర్చడం తప్ప, వేరొక ఫలిత మేమీ ఉండదని కోర్టువారికి మనవి చేస్తున్నాను."

"కావచ్చు యువరానర్!

మై లెర్నెడ్ ఫ్రెండ్ చెప్పినట్లు కొంతకాలం వృధా అయితే కావచ్చు.

కాని జీవితం కాలంకన్నా విలువైనది కదా! వేయి మంది దోషులు శిక్షను తప్పించుకున్నా, ఒక్క నిర్దోషి మాత్రం శిక్షింపబడకూడదని న్యాయశాస్త్ర ఆదర్శం ప్రకారం....

నా క్లయింట్ కు తాను నిర్దోషినని నిరూపించుకోడానికి మరో అవకాశాన్ని కల్పించాలి" అన్నాడు గణపతిరావు.

"అబ్జక్షన్ ఓవర్ రూల్డు" అన్నారు జడ్జిగారు.

"యువరానర్!

నా క్లయింట్ శ్రీమతి సుగుణపై మోపబడ్డ మొదటి అభియోగం....'ఆమె ఈ హత్యను ఆస్తి కోసం చేసిందని.'

ఈ అభియోగం నిరాధారమైనదని రుజువు చేసేందుకు సాక్ష్యులను ప్రవేశపెట్టడానికి కోర్టువారిని అనుమతి కోరుతున్నాను."

"రిక్వెస్టు గ్రాంటెడ్. ప్రొసీడ్" అన్నారు జడ్జిగారు.

"నా మొదటి సాక్షి....లాయర్ ముకుందం."

"లాయర్ ముకుందం...లాయర్ ముకుందం!" రాగయుక్తంగా అరిచాడు కోర్టు జవాను.

నలభై యేళ్ళ వయసున్న మధ్యవయస్కుడు మెల్లగా నడుచుకుంటూ వచ్చి బోనులో ప్రవేశించాడు.

ఒక్కసారి అతనివంక పాలోచనగా చూసి, ప్రశ్నలను అడగటం ప్రారంభించాడు గణపతిరావు.

"మీ పేరు?"

"ముకుందం.... కే."

"వృత్తి....?"

"మీ వృత్తే! లాయర్ని" చిన్నగా నవ్వుతూ అన్నాడతడు.

"ప్రియా ఫెర్టిలైజర్స్ మేనేజింగ్ డైరెక్టర్ గోపాలరావుగారు మీకు తెలుసా?"

"తెలుసు. నేను వారి ఫామిలీ లాయర్ని."

"గోపాలరావుగారి తదనంతరం వారి ఆస్తి ఎవరికి చెందుతుంది"

"వారి భార్య సుగుణగారికి"

"అలా........వీలునామా యేమయినా వ్రాశారా వారు?"

"ఆఁ.... వారి విల్లును నేనే రిజిష్టర్ చేయించాను."

"ఆ విల్లును గురించి సుగుణగారికి చెప్పారా?"

"ఆఁ.... చెప్పాను."

"ఎప్పుడు?"

"ఆమె జైల్లో ఉండగా కలుసుకొని చెప్పాను."

"అంటే, ఆమె భర్త మరణం తరువాతే, మీరు ఆ వీలునామా గురించి తెలియజేశా రంటారు."

"అవును."

"దట్సాల్ యువరానర్!" అంటూ కూర్చున్నాడు గణపతిరావు.

ప్రాసిక్యూటర్ రామానుజానికి, గణపతిరావు ఎత్తేమిటో స్పష్టంగా తెలుస్తూంది.

"ఎనీ క్వొశ్చన్స్ ఫ్రం ప్రాసిక్యూషన్?" జడ్జిగారు ప్రశ్నించారు.

రామానుజం లేచి నిలబడ్డాడు. సూటిగా బోనులో నిలబడ్డ ముకుందాన్ని చూశాడు.

"వెల్ మిస్టర్ ముకుందం.

మీరు విల్లు గురించి శ్రీమతి సుగుణతో యిప్పుడే.... అంటే గోపాలరావుగారి హత్య తరువాతే చెప్పివుండవచ్చు.

కాని, అంత మాత్రాన హత్యకు ముందు ముద్దాయికి ఆ విల్లు గురించి తెలియదని ఎలా నిర్ధారించగలరు?

ఒకవేళ, ఆమె భర్త తను వ్రాసిన విల్లు గురించి ఆమెకు చెప్పివుండవచ్చు కదా!"

"అబ్జక్షన్ యువరానర్" అంటూ గణపతిరావు లేచి నిలబడ్డాడు.

"ప్రాసిక్యూటర్‌గారు తమ అభిప్రాయాన్ని బలవంతంగా సాక్షిపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారు."

"అబ్జక్షన్ సస్టెయిండ్" అన్నారు జడ్జిగారు.

"పోనీ మరోకలా అడుగుతాను" అన్నాడు రామానుజం.

"ఆ విల్లును గూర్చి తన భార్యతో గాని, లేక యింకెవరితో గాని గోపాలరావుగారు చెప్పినట్లుగా మీకు తెలుసా?"

"లేదు!

ఆ విల్లును గురించి కొన్నాళ్ళ పాటు యెవరికీ తెలియనీయవద్దని గోపాలరావుగారే స్వయంగా

చెప్పారు.

అలా నాతో అన్న వ్యక్తి, తాను ఇంకెవరితోనైనా చెప్పివుంటారంటే నేను నమ్మను."

ముకుందం మాటలకు, రామానుజం ముఖం మ్లానమయింది.

తను చెప్పిన చిలకపలుకలను, చక్కగా కోర్టులో అప్పజెప్పిన ముకుందంవంక ముచ్చటగా చూశాడు లాయర్ గణపతిరావు.

"నో మోర్ యువరానర్" అంటూ విసుగ్గా కుర్చీలో కూలబడ్డాడు రామానుజం.

"మై నెక్స్‌ట్ విట్నెస్ గుమస్తా గుర్నాథం" అన్నాడు గణపతిరావు.

కోర్టు బంట్రోతు పిలుపునందుకుని,గుమస్తా గుర్నాథం, బోనులోకి వచ్చి నిలబడ్డాడు.

భగవద్గీతమీద చేయి వేసి అంతా నిజమే చెబుతానని అబద్ధం చెప్పనని ప్రమాణం చేశాడు.

గణపతిరావు బోనును సమీపించి గుర్నాథం వంక సూటిగా చూశాడు.

"మీ పేరు?"

"గుర్నాథమండి."

"మీరేం చేస్తుంటారు?"

"గోపాలరావుగారి యింటిలో గుమస్తానండి."

"ఇంటిలోనా?"

"చిత్తం! యింటికి కావాల్సిన వెచ్చాలు, నౌకరుల జీతాలూ, ఇతర చిల్లర జమాఖర్చులూ అన్నీ చూస్తుంటానండి."

"మీ అమ్మగారు, అంటే శ్రీమతి సుగుణగారు ఖర్చు

మనిషా?"

"మెల్లగా అడుగుతారేమిటండీ! వేలకు, వేలు ఎడం చేత్తో ఖర్చు చేసేవారండీ."

"ఆమెకు ఖర్చుకు కావాల్సిన డబ్బును అయ్యగారే యిచ్చేవారా?"

"లేదండి. నేనే యిచ్చేవాడినండి."

"మీరా?"

"చిత్తం! పెట్టికేష్ అంతా నేనే చూస్తూండేవాడిని కదండి. అందులో యిచ్చేవాడినండి"

"మరి, మీ అమ్మగారు అంత డబ్బును దుబారాగా ఖర్చు చేస్తుంటే మీ అయ్యగారు కోప్పడేవారు కాదా!"

"ఛ! ఛ! ఆయన అలాంటివారు కాదండి. అమ్మగారు యెంత కావాలంటే అంత డబ్బు యివ్వమని చెప్పేవారండి. వారేమిటండి లక్షాధికారులు!"

"దట్సాల్ యువరానర్" అన్నాడు గణపతిరావు.

"ఎనీ క్వశ్చన్స్ ఫ్రం ప్రాసిక్యూషన్?"

"నో క్వశ్చన్స్ యువరానర్!"

రామానుజానికి తెలుసు. ఈ సాక్షిని ప్రశ్నించడం వృధా అని గణపతిరావు ఒకసారి చుట్టూ కలియజూసి గొంతును సవరించుకున్నాడు.

"మి లార్డ్!

ఇప్పుడు కోర్టువారి సమక్షంలో ప్రశ్నించబడ్డ ఇద్దరు సాక్షుల కథనాన్ని మీరు ఆలకించారు.

నిజమే! శ్రీమతి సుగుణ ఖర్చు మనిషే!

అయితే. ఆమె విలాసంగా ఖర్చుచేయడానికి ఆమెకు అడ్డంకులు యేమీ లేవు. ఆమె భర్త ఆమెకు ఆర్థికంగా

పూర్తి స్వేచ్ఛ నిచ్చాడు.

బంగారు గుడ్లు పెట్టే బాతును ఎవరూ చంపుకోరు యువరానర్! పెంచుకుంటారు.

యిక, ఆస్తి తన పేర వ్రాయబడిందన్న విషయం ముద్దాయికి ఈ హత్య జరిగిన తరువాతే తెలిసింది. కాబట్టి ముద్దాయి ఆస్తికోసమే ఈ హత్యను చేసిందనడానికి ఆస్కారమే లేదు."

తన వాదనను ఆపి క్రీగంట ప్రాసిక్యూటర్ వంక చూశాడు గణపతిరావు.

జడ్జిగారు ఒకసారి తన చేతికున్న వాచ్ వంక చూసు కున్నారు. తరువాత మెల్లగా లేచి నిలబడ్డారు.

"ద కోర్ట్ ఈజ్ ఎడ్జర్న్డ్" అన్నారు.

6

"యువరానర్!

ఈ కేసులోని ముఖ్యమైన పాయింట్‌ను పైలెర్న్డ్ డిఫెన్స్ లాయర్ గణపతిరావ్ తెలివిగా మభ్యపరి చారు....

ఈ హత్య ఎందుకు జరిగింది?

ముద్దాయి సుగుణ, ఒక పరాయి పురుషునితో అక్రమ సంబంధాన్ని కలిగివుండటాన్ని, హతుడు గోపాలరావు ప్రత్యక్షంగా చూశాడు.

ఆ విషయాన్ని పీపుల్స్ ఎగ్జిబిట్ 'డి'గా సబ్‌మిట్ చేయబడ్డ హతుని డైరీ ధృవపరుస్తూంది.

తన భర్తకు తన అక్రమసంబంధం గురించి తెలిసి పోయిందని గ్రహించిన ముద్దాయి సుగుణ, తన ప్రియుని సహాయంతో ఈ హత్య చేసింది.

యువరానర్!

ముద్దాయితన్న అక్రమసంబంధం గురించి ఆ యింటి వాకరు సీనయ్య సాక్ష్యం ఉంది.

అన్నింటినీ మించి.... ఆ యింటి పెరడులో దొరికిన శవం. ఆ గోతిదగ్గర ముద్దాయి అడుగుల గుర్తులు, స్టోర్ రూమ్‌లో లభించిన పార, గునపంపై ముద్దాయి వేలి ముద్రలు....యివన్నీ శ్రీమతి సుగుణను దోషిగా నిర్ధారిస్తున్నాయి.

ఇట్స్ ఎ ప్రీ ప్లాన్డ్ కోల్డు మర్డర్!

యువరానర్!

పరాయిపురుషునితో అక్రమసంబంధం పెట్టుకున్నది చాలక, ఆ రహస్యం భర్తకు తెలిసిపోయిందని తెలిసి, తాళికట్టిన భర్తనే అమానుషంగా చంపిన ఈ హంతకిని కోర్టువారు కఠినంగా శిక్షించాలని మనవి చేస్తున్నాను."

తన వాదనను ముగించి, గర్వంగా తన సీటులో కూర్చున్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామానుజం.

డిఫెన్స్ లాయర్ గణపతిరావు మెల్లగా లేచి నిలబడ్డాడు. జడ్జిగారికి అభివాదం చేశాడు.

"మిలార్డ్!

ప్రాసిక్యూటర్ గారు అడిగిన ప్రశ్న అన్నింటికీ సమాధానం ఒక్కటే! అది.... నా క్లయింట్ సుగుణ సాక్ష్యం!

శ్రీమతి సుగుణ మరోసారి తన వాఙ్మూలాన్ని ఇవ్వడానికి కోర్టువారు అనుమతించాలి."

"రిక్వెస్టు గ్రాంటెడ్" అన్నారు జడ్జిగారు.

కోర్టు గుమాస్తా తెచ్చిన భగవద్గీ మీద చేయి వేసి "దేవుని ఎదుట ప్రమాణం చేసి అంతా నిజమే చెబుతాను, అబద్ధం చెప్పను...." అంది బోనులో నిలబడ్డ

సుగుణ.

అంతా ఆమెవంక ఉత్సుకతతో చూస్తున్నారు.

“నేనూ, ఆంటోనీ ప్రేమించుకున్నాం. పెళ్ళి కూడా చేసుకోవాలనుకున్నాం. కాని చివరిక్షణంలో తెలిసింది నాకు అతడు ప్రేమిస్తున్నది నా అందాన్ని, నేను చేస్తున్న ఉద్యోగాన్ని, తద్వారా వస్తున్న సంపాదనని. మా మధ్య పెళ్ళి ప్రసక్తి వచ్చిన పదిరోజులలోనే అత డెక్కడికో పరారై పోయాడు.

ఆ తరువాత నా వివాహం గోపాలరావుగారితో జరిగింది. హాయిగా సాగిపోతున్న నా సంసారంలోకి విషపు పురుగులా మళ్ళీ ప్రవేశించాడు ఆంటోనీ.

మేము వ్రాసుకున్న ఉత్తరాలు, మే మిద్దరం కలిసి తీయించుకున్న ఫోటోలను చూపించి, నన్ను బ్లాక్ మెయిల్ చేయసాగాడు.

ఆ ఉత్తరాలూ, ఫోటోలు నా భర్త చేతిలో పడితే నా కాపురం కూలిపోతుంది. ఆడదాన్ని నేను యేం చేయగలను? అతడు అడిగిన డబ్బును యివ్వసాగాను.

అయితే, అతడు కేవలం డబ్బుతో తృప్తిపడలేదు. నా శరీరాన్ని కూడా కోరాడు.

నిజమే!

అతడికి నా శరీరమేమీ క్రొత్తది కాదు. పెళ్ళికిముందే మేం తొందరపడ్డాం! కాని, యిప్పుడు యింకొకరి భార్యనయిన నేను మళ్ళీ అతడితో అక్రమ సంబంధం పెట్టుకోవాలంటే నాకు అసహ్యం వేసింది.

కాని, నా కాపురం నిలబెట్టుకోవడానికి అతడి కోరికకు తల వంచక తప్పలేదు నాకు.

నా దురదృష్టం! మా అక్రమసంబంధం నా భర్త

కంట పడింది.

ఆ రోజు రాత్రి....

నా భర్తను మాని ఆంటోనీ పారిపోయాడు. నా భర్త నన్ను నా నా దుర్భాషలూ ఆడి తన గదిలోనికి వెళ్ళిపోయాడు. నేను ఏడుస్తూ కూర్చున్నాను.

సుమారు గంటో, రెండు గంటలో గడిచివుంటాయి. ఆంటోనీ మళ్ళీ వచ్చాడు. నా నగలనూ, చేతికి అందిన డబ్బునూ తీసుకొని తనతో వచ్చేయమన్నాడు.

"నా సంసారాన్ని యిప్పటికే సర్వనాశనం చేశావు. ఇంకా నన్నెందుకు వెంటాడుతావు? తక్షణం నా కళ్ళ ముందు నుండి పో!" అంటూ అతడిని తిట్టాను నేను.

మేమిద్దరం ఘర్షణ పడుతున్నాం.

ఇంతలో ఆ గదిలోనికి యెప్పుడు వచ్చారో.... యేమో! నా భర్త పిల్లిలా అడుగులు వేసుకుంటూ ఆంటోనీ వెనుకకు చేరుకున్నారు. అతడి చేతిలో యేదో గూటంలాంటి వస్తువుంది. దానితో బలంగా ఆంటోనీ తలపై మోదారు.

అంతే! రక్తం వరదలయి కారుతుంటే కుప్పకూలిపోయాడు ఆంటోనీ. నా భర్త అతడి ముఖాన్ని పూర్తిగా చితకగొట్టారు.

నేను నిశ్చేష్టురాలినై నిలబడి వుండిపోయాను.

ఆ వేశంలో హత్య చేసేశారు గాని, ఆ తరువాత నా భర్తకు కూడా కాళ్ళూ, చేతులూ ఆడలేదు. కొంత సేపటి తరువాత ఆయన తేరుకున్నారు.

ఆంటోనీ శవాన్ని తోటలో పాతిపెట్టాం మేమిద్దరం. నా గదినీ, ఆ పలుగునూ, పారనూ శుభ్రంగా కడిగి వేసాను నేను,

అంతా సత్యంగా జరిగిపోయింది అనుకున్నాను నేను. కాని, నా భర్త ఆ రోజు రాత్రే యెక్కడికో వెళ్ళి పోయారు. పోలీసులు వచ్చి ఎంక్వయిరీ ప్రారంభించారు.

నేనేం చెప్పగలను?

నిజం చెబితే, నా భర్త మెడకు ఉరిత్రాడు చుట్టు కుంటుంది. నిజం చెప్పకుంటే నన్నే హంతకురాలుగా పోలీసులు చిత్రిస్తున్నారు.

నేను తీవ్రంగా ఆలోచించాను.

నా భర్తను రక్షించుకోవాలంటే నేను నోరు విప్ప కూడదు. దాని పర్యవసానం నేను ఉరికంబానికి ఎక్కా ల్సినా సరే!

నా భర్తకు నేను చేసిన ద్రోహానికి అదే నాకు తగిన శిక్ష అనుకున్నాను.

ఇదంతా ఎందుకు చేశాను?

కేవలం, నా భర్త నన్ను క్షమిస్తాడని.

కాని, ఆయన నా గూర్చి పట్టించుకోలేదు. ఆయన కోసం జైలులో క్రుంగిపోతున్న నన్ను చూడటానికి ఆయన ఒక్కసారి వచ్చి ఉంటే....నన్ను పలకరించి ఉంటే.... నేను జీవితాంతం హాయిగా జైలు శిక్షను అనుభవించి ఉండేదాన్ని.

కాని, అజ్ఞాతంగా వున్న నా భర్త నన్ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. నేనెవరో తెలియనట్లు ఊరుకున్నారు.

ఎవరికోసం నేను ఈ శిక్షను అనుభవిస్తున్నానో, ఆయనకు నేనేమైపోయినా అవసరం లేనప్పుడు నేనెం దుకు అన్యాయంగా శిక్షను అనుభవించాలి? అందుకే నిజం చెబుతున్నాను. నేను నిర్దోషిని.

నాకే పాపమూ తెలియదు"

—అంటూ భోరుమని ఏడుస్తూ, బోనులో కుప్పలా కూలిపోయింది సుగుణ.

ఇంతలో....

ప్రేక్షకుల గ్యాలరీ మధ్య నుండి ఒక వ్యక్తి సుడి గాలిలా ముందుకు దూసుకు వచ్చాడు. గడ్డాలూ, మీసాలూ వత్తుగా పెరిగి వున్నాయి అతడికి. ముదురు ఆకుపచ్చరంగు శాలువా కప్పుకొని వున్నాడు.

అతడిని చూస్తూనే ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చున్న నౌకరు సీనయ్య, గుమస్తా, గుర్నాథం, లాయర్ ముకుందం ఆశ్చర్యంగా లేచి నిలబడ్డారు.

“అయ్యగారూ!” అన్నాడు సీనయ్య.

“గోపాలరావుగారు....గోపాలరావుగారు....గోపాల గారు...”

కోర్టు హాలంతా గుస, గుసలతో....కలకలం బయలు దేరింది.

అంతా అతడి వంకే చూస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్ జయంత్ ఆత్రంగా తన ముందున్న ఫైలును తిరగవేశాడు. అందులోనున్న గోపాలరావు ఫోటో వంక, ఆ వ్యక్తి వంక మార్చి మార్చి చూశాడు.

సందేహం లేదు.

అతడు గోపాలరావే!

పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామానుజం ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

బోనులో కూలబడిన సుగుణ ఆ కలకలానికి కళ్ళు తెరిచి చూసింది.

ఎదురుగా తన భర్త....గోపాలరావు.

“ఏమండీ....!” అంది ఆమె ఆనందంగా లేచి నిం

బడుతూ.

ఆ వ్యక్తి మరో అడుగు ముందుకు వేశాడు. శాలువా క్రిందనున్న అతడి కుడిచేయి పైకి వచ్చింది. అతని చేతి లోని రివాల్వర్ రెండుసార్లు గర్జించింది.

మొదటి గుండు సూటిగా వచ్చి సుగుణ భుజానికి తాకింది. అంతే! ఆమె కెవ్వున కేక వేస్తూ క్రిందకు పడి పోయింది. రెండవ గుండు ఆమె నిలుచున్న బోనుకు తగిలింది.

"మై గాడ్!" చిన్నగా అరచారు జడ్జీగారు.

రివాల్వర్ మ్రోతతో కోర్టులో అలజడి ప్రారంభ మయింది. కెవ్వుమని కేకలు వేస్తూ ప్రేక్షకులు, లాయర్లు పిచ్చెక్కినట్లు పరుగులెత్తారు.

ఇన్ స్పెక్టర్ జయంత్, కాన్ స్టేబుల్స్‌ని ఎలర్టు చేసి గ్యాలరీవైపు పరిగెత్తేసరికి.....గోపాలరావు అదృశ్య మయ్యాడు.

7

"నీవు తిరిగి వచ్చేటంత వరకూ టెన్‌షన్‌తో చచ్చి పోయాననుకో నిక్కీ!" అంది సంధ్య అతడిని లతలా పెనవేసుకుపోతూ,

చిన్నగా నవ్వాడు నికల్సన్.

"ఎందుకు డార్లింగ్! అంత భయం?" పెట్టుడు గడ్డం మీసాలనూ తీసేస్తూ అన్నాడతను.

అతడి భుజంమీదనున్న ముదురు ఆకుపచ్చరంగు శాలు వానుతీసి ప్రక్కన పడేసింది ఆమె.

"నీకు నవ్వులాటగానే వుంటుంది నిక్కీ! గోపాలరావు వేషంలో ఉన్న నీవు మన దురదృష్టవశాత్తూ పోలీసులకు పట్టుబడితే....!"

"నెవ్వర్!" అన్నాడతను దృఢంగా.

"దేశ ప్రధానిని చంపటానికి, ప్రధాని ఒక నిర్ణీత స్థలానికి, నిర్ణీత సమయానికి వస్తారని తెలిసి, ఆ స్థలంలో అందరిమధ్యా రెండు రోజాలుగా పొదలలో దాక్కున్న హంతకుని ఆచూకీని కనుగొనలేని ఈ పోలీసు వ్యవస్థలో మనలాంటి వారు చాలా సులువుగా తప్పించుకోవచ్చు.... డార్లింగ్!

అప్టరాల్....ఏ కాపలా వుండని ఒక కోర్టు హాల్లో ఒక వ్యక్తిని కాల్చిరావడం, అదెంత పని?"

సంధ్య కళ్ళు విప్పార్చుకుని అతని వంకే చూస్తుంది.

"అయితే ఒక్క విషయంలో నాకు భయం వేసింది! నేను ప్రేల్చిన రివాల్వర్ గుండు సుగుణ భుజానికి కాక గుండెకు తగులుతుందేమోనని!

ఎంత ఎక్స్పర్ట్ షూటర్నైనా, అది ప్రాణాలతో చెలగాటం కదా! అదీగాక మనకు సుగుణ ఎలాగైనా బ్రతికే తీరాలికదా!" అన్నాడతడు నవ్వుతూ.

"అయితే సుగుణ నిర్దోషిగా విడుదలవుతుందంటావా?" ఆత్రంగా అడిగిందామె.

"ఏం? సందేహమా?"

—అదే సమయంలో....

అక్కడ....కోర్టు హాల్లో....

లాయర్ గణపతిరావు తన చివరి వాదనను కొనసాగిస్తున్నాడు.

"యువరానర్!

ప్రాసిక్యూషన్ వారు పీపుల్స్ ఎగ్జిబిట్ 'డి'గా ప్రవేశపెట్టిన గోపాలరావుగారి డైరీలో వ్రాసుకున్న చివరి మాటలను ఒక్కసారి పరిశీలించండి.

'ఆ క్షణంలో వాళ్ళిద్దరినీ అక్కడికక్కడే నరికి పోగులు పెడదామన్న ఆవేశం వచ్చింది నాకు.

ఇవి స్వయంగా గోపాలరావుగారు వ్రాసిన మాటలు!

నిజమే! తాళికట్టిన భార్య పరాయి మగవానితో కలుసుకుంటే యే మగాడూ చూస్తూ సహించలేడు. పట్టరానంత ఆవేశం వస్తుంది ఎవరికైనా.

ఆ ఆవేశంలోనే....గోపాలరావుగారు తన భార్య ప్రియుడైన ఆంటోనీని హత్య చేశారు.

ఆ హత్యకు ప్రత్యక్ష సాక్షి....ఈ కేసులో ముద్దాయిగా పరిగణింపబడుతున్న నా క్లయింట్ సుగుణ.

ఈ రోజు....మనందరి కళ్ళ ఎదుటే, చనిపోయాడని భావించబడుతున్న గోపాలరావు దారుణంగా తన భార్యను హత్య చేయడానికి ప్రయత్నించడం మనం కళ్ళారా చూశాం. ఆయనలో హంతకుని ప్రవృత్తి ఉందనడానికి ఈ సంఘటనే ప్రత్యక్ష సాక్ష్యం.

సుగుణను హత్య చేయాల్సిన అవసరం ఒక్క గోపాలరావుకు తప్ప యింకెవరికీ లేదు.

హత్యకు మోటివ్....ఆమెపట్ల అతడికున్న అసహ్యం, ద్వేషం, పగ.

ఆమెపై పగబట్టేవారు ఇంకెవరు ఉంటారు?

యువరానర్!

ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు 1872, సెక్షన్స 107, 108 ల ప్రకారం చనిపోయాడని భావింపబడుతున్న గోపాలరావు జీవించి వున్నాడనే నిజం, నిరూపించబడటంవలన___

సదరు గోపాలరావుని హత్య చేసిందన్న అభియోగం మోపబడ్డ నా క్లయింట్ నిర్దోషి అని నిర్ధారణ మవు

తున్నది.

జీవించి వున్న మనిషి హత్య చేయబడ్డాడనటం, ఆ హత్యా నేరానికి ఒక అమాయకురాల్ని శిక్షించబోవటం అర్థరహితం. యువరానర్!

హత్య చేయబడ్డది ఆంటోనీ.

గోపాలరావు హంతకుడు కాడు హంతకుడు!"

జడ్జిగారు గణపతిరావు వంక ప్రశంసాపూర్వకంగా చూశారు.

"యువరానర్!

సరిగ్గా ఇలాంటి కేసే ఒకటి ఈ మధ్య ఆస్ట్రేలియాలో జరిగింది.

తన భర్తను హత్య చేసిందన్న నేరంపై ఒక స్త్రీ అరెస్టు చేయబడింది.

అయితే సిడ్నీలో.... భారత, ఆస్ట్రేలియాల మధ్య జరుగుతున్న ఒక క్రికెట్ మ్యాచ్‌లో....ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చున్న ఆమె భర్తను కొందరు వ్యక్తులు చూశారు.

పోలీసులు ఆమె భర్తకోసం అన్వేషణ ప్రారంభించారు. కాని, యింతవరకూ అతడి ఆచూకీ లభించలేదు.

అయితే, ఆమె భర్త జీవించి వున్నాడని తెలియడం చేత జీవించివున్న భర్తను చంపిందన్న అభియోగాన్ని కొట్టిపారేస్తూ... బెనిఫిట్ ఆఫ్ డౌట్ క్రింద ఆమెను నిర్దోషిగా విడుదల చేసింది ఆ న్యాయస్థానం.

మిలార్డ్!

ఆస్ట్రేలియా కోర్టు తీర్పును కూడా ఒక రిఫరెన్స్‌గా తీసుకొని, నా క్లయింటును నిర్దోషిగా గుర్తించి విడుదల చేయాల్సిందిగా కోర్టువారిని అర్థిస్తున్నాను."

ఆర్గ్యుమెంటును ముగించి, జడ్జికి అభివాదం చేసి, హుందాగా నడుచుకుంటూ పోయి తన సీట్లో కూర్చు న్నాడు గణపతిరావు.

“బ్లడీ.... బెనిఫిట్ ఆఫ్ డౌట్!” మనసులో కసిగా తిట్టుకున్నాడు ప్రాసిక్యూటర్ రామానుజం.

అతనికి తెలుసు. ఈ కేసులో తాను ఓడిపోబో తున్నానని, 'సుగుణ నిర్దోషి' అని జడ్జిగారు తీర్పు ఇవ్వ బోతున్నారని.

“బ్లడీ ఎవిడెన్స్ ఏక్ట్!” అనుకున్నాడు అతడు విసుగ్గా.

8

శవం వంక పరీక్షగా చూశాడు ఇన్‌స్పెక్టర్ జయంత్.

ఆ రోజు ఉదయం స్టేషన్‌మాస్టర్ వద్ద నుండి ఫోన్ వచ్చింది అతనికి. 'రైల్వేస్టేషన్‌కు కొంతదూరంలో పట్టా లపై ఒక శవం పడివుందని, మార్నింగ్ రొటీన్ ప్రకారం ట్రాక్ చెక్ చేయడానికి వెళ్ళిన లైన్‌మేన్ ఆ శవాన్ని చూసి తనకు రిపోర్టు చేశాడని' చెప్పాడతడు.

ఆ కాల్ అందుకున్న మరుక్షణం హుటాహుటిని బయలుదేరి రైల్వేస్టేషన్ చేరుకున్నాడు ఇన్‌స్పెక్టర్.

శవాన్ని ముందుగా చూసిన లైన్‌మేన్ స్టేషన్ మాస్టర్ ముందు నడుస్తూ దారి చూపుతుంటే వెంట వచ్చిన కాన్‌స్టేబిల్సుతో సహా ఆ డెత్ స్పాట్ వంక నడి చాడు జయంత్.

రైల్వేట్రాక్‌కు అడ్డంగా పడివుంది ఆ శవం. నిజానికి అది శవాకారంలో లేదు. నలిగి గుజ్జులా మారిన మాంసపు

ముద్దలా వుంది.

పగిలిన తలలోనుండి త్రుళ్ళిపడ్డ తెల్లని మెదడు రక్తం ఓడుతూ ఓ ప్రక్కగా పడివుంది. అసలు ఆ శవానికి తల భాగం కనిపించటం లేదు. ఆ స్థానంలో కైమా కొట్టబడినట్లు కొంత మాంసపుముద్ద పట్టాలకు అంటివుంది. కాళ్ళు, చేతులూ చెఱకుగడల్లా పిప్పి అయివున్నాయి. పెద్ద బండతో మోదినట్లు గుండె, పొట్ట చితికిపోయి మాంసపు ముద్దల్లా కన్పిస్తున్నాయి.

ఎన్నో శవాలను చూసిన పోలీసులు సయితం ఆ శవాన్ని చూడలేక ముఖాల్ని తిప్పుకున్నారు. వారి కడుపులో ప్రేగులు మెలిత్రిప్పినట్లయింది. మరో రెండు క్షణాలు అక్కడే ఉంటే వాంతి వచ్చేటట్లుంది వారి పరిస్థితి.

ఇక చూడలేక గిరుక్కున వెనుతిరిగాడు ఇన్‌స్పెక్టర్ జయంత్. అప్పుడు అతని కంట పడింది ఆ శవంపై నున్న శాలువా.

కళ్ళు విప్పార్చుకొని చూశాడతడు.

అది.... ఆకుపచ్చ రంగు శాలువా!

అలాంటి శాలువాను యెక్కడో చూసినట్లనిపించింది అతనికి. కాని ఎక్కడో గుర్తుకు రావటం లేదు.

అతడు ఆలోచిస్తున్నాడు.

"సార్! శవానికి కాస్త దూరంలో ఈ సంచి పడివుంది సర్!"

ఖాకీ రంగులో నున్న చిన్న గుడ్డ సంచీని అందిస్తూ అన్నాడొక కానిస్టేబిల్.

ఆ సంచిని అందుకున్నాడతడు అందులో ఏముందో

నని ఆత్రంగా తొంగిచూశాడు.

మడతలు పెట్టబడిన పెద్ద నేప్ కిన్ కనిపించింది. దానిని పైకి తీశాడు. నేప్ కిన్ మడతలమధ్య ఏదో నల్లని వస్తువు కన్పిస్తూంది.

నేప్ కిన్ మడతలను విప్పాడు.

అంతే! ఆ మడతల మధ్యనున్న నల్లనివస్తువును చూసి ఉలిక్కిపడ్డాడతడు.

అది... రివాల్వర్!

దానిపైనున్న వ్రేలిముద్రలు చెరిగిపోకుండా జాగ్రత్తగా ఆ నేప్ కిన్ తోనే చుట్టి ఆ సంచిలోనే భద్రపరిచాడు.

నేప్ కిన్ ను లోపల పెడుతూ వుండగా, అతని చేతి వ్రేళ్ళకు తగిలాయి సంచి అడుగునున్న కొన్ని కాగితాలు. వాటిని పైకి తీసాడతడు.

అవి దస్తావేజా కాగితాలు.

వాటిని తెరచి చూశాడు.

అంతే! ఆశ్చర్యంతో అతని కళ్ళు పెద్దవయ్యాయి. అవి... తన యావదాస్తినీ తన భార్య సుగుణ పేర వ్రాస్తూ రిజిష్టర్ చేయించిన గోపాలరావుగారి వీలునామా నకలు పత్రాలు.

వాటిని చూడగానే ఆ ఆకుపచ్చ రంగు శాలువాను తాను ఎక్కడ చూశాడో ఛటుక్కున గుర్తుకు వచ్చింది అతనికి.

కోర్టులో తన భార్య సుగుణను రివాల్వర్ తో కాల్చి చంపడానికి ప్రయత్నించిన గోపాలరావు సరిగ్గా అలాంటి శాలువనే ధరించాడు.

'ఆ శాలువా.... నేప్ కిన్ లో చుట్టబడ్డ రివాల్వర్, ఆ వీలునామా పత్రాలు' వీటిని బట్టి ఆ శవం యెవరిదో

అర్థం అయిపోయింది అతనికి.

'గోపాలరావు! గోపాలరావేనా?'—అతడు సందిగ్ధంలో కొట్టు, మిట్టులాడుతున్నాడు.

“బహుశ ట్రాక్‌ను క్రాస్ చేస్తూ ఉండగా ఈ ప్రమాదం సంభవించి వుండవచ్చు ఇన్‌స్పెక్టర్! చీకటిలో వస్తున్న రైలును గమనించలేదో! లేక, రైలు వచ్చే లోగా క్రాస్ చేసేయగలనన్న గుడ్డి నమ్మకంతో.... నిర్లక్ష్యంగా పట్టాలను దాటేయబోయాడో!

ఎనీ హౌ! ఇట్స్ ఎ హారిబుల్ డెత్!”

స్టేషన్ మాస్టరు చెబుతున్న మాటలను వింటూ చక, చకా అడుగులు వేస్తున్నాడు ఇన్‌స్పెక్టర్.

అయితే, అతడు ఆలోచిస్తున్నది హతుడు ఎలా మరణించాడా అని కాదు. హతుడు గోపాలరావే అయితే, అతని సంచిలో ఆ విల్లు యెందుకున్నట్లు?—అదీ అతడు ఆలోచిస్తున్నది.

అది విల్లు నకలు.

ఆ రోజు రాత్రి.... ఆంటోనీని హత్యచేసి, పారిపోయిన గోపాలరావు తనతో పాటుగా ఆ విల్లు నకలును కూడా తీసుకొనిపోయి ఉంటాడా?

ఎందుకోసమైనా, ఏమైనా....

అలా తీసుకొని వెళ్ళేవాడయితే అసలు విల్లునే తీసుకొని వెళ్ళిపోతాడు కాని నకలు నెందుకు తీసుకువెళ్తాడు?

కాబట్టి, ఆ రోజు రాత్రి అతడు ఆ విల్లును తీసుకొని వెళ్ళివుండడు. ఈ మధ్యే యెవరో అతనికి ఆ నకలును అందించి వుండాలి.

ఎవరు అందించి ఉంటారు?

ఎవరి దగ్గర ఉంటుంది ఆ నకలు?

ఎవరైతే ఆ విల్లును వ్రాసారో ఆ లాయర్ వద్ద ఉంటుంది ఆ నకలు! అంటే లాయర్ ముకుందరావు ఆ విల్లును గోపాలరావుకు అందజేసి ఉంటాడా? ఎందుకు?

ఆ చిక్కు ప్రశ్నల ముడులను విప్పడంకోసం అతడు వెంటనే లాయర్ ముకుందరావును కలుసుకున్నాడు.

“నిజమే! నేనే ఆ విల్లు నకలును గోపాలరావుగారికి అందజేశాను” అన్నాడు ముకుందరావు.

“ఎప్పుడు?”

“నిన్న రాత్రి!”

“ఏం జరిగిందో కొంచెం వివరంగా చెబుతారా?” ముకుందరావు కళ్ళల్లోనికి సూటిగా చూస్తూ అడిగాడు ఇన్‌స్పెక్టర్.

ముకుందరావు చిన్నగా గొంతును సవరించుకున్నాడు.

“నిన్న రాత్రి ఏడుగంటల ప్రాంతంలో అనుకుంటాను. నాకు గోపాలరావుగారి దగ్గరనుండి ఫోన్ వచ్చింది ఫోన్‌లో ఆయన గొంతు విని ఆశ్చర్యపోయాను నేను.

రైల్వేస్టేషన్‌కు దగ్గరలో నున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోనుండి తాను మాట్లాడుతున్నాననీ, వెంటనే తాను వ్రాసిన విల్లు పత్రాలను తీసుకొని అక్కడికి రమ్మని చెప్పా రాయన.”

“ఎందుకు? ఎందుకా విల్లు?” అసహనంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

అతనిని చూసి చిన్నగా నవ్వాడు ముకుందరావు.

“నేనూ అదే ప్రశ్న వేశాను ఇన్‌స్పెక్టర్!

‘తాను విల్లును మార్చి వ్రాయాలనుకుంటున్నానని’ అన్నా రాయన.

అయితే అసలు విల్లు పత్రాలు నా వద్ద లేవు. అవి

సుగుణగారికి అందజేశాను.... ఈ మధ్యే! ఆ మాటే చెప్పారాయనతో.

అయితే విల్లు నకలును తీసుకురమ్మని చెప్పారాయన. సరేనన్నాను నేను.”

“అయితే, గోపాలరావుగారిని మీరు కలుసుకున్నారా?” ఆత్రంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

అవునన్నట్లు తలూపాడతడు.

‘ప్రశాంతంగా గడచిపోతున్న తన జీవితంలోనికి ప్రవేశించి, ఈ రోజు తాను హంతకునిగా మారి, ఇలా చీకటి జీవితాన్ని గడుపుతుండడానికి కారణమైన తన భార్య సుగుణకు తన ఆస్తి దక్కడానికి వీలులేదనీ .

ఇన్నాళ్ళూ, తన బదులుగా జైలుశిక్షను అనుభవిస్తున్నదనే సాఫ్ట్ కార్నర్ యేమైనా తన భార్యపై మిగిలివుంటే.... అది ఆమె నిన్న కోర్టులో యిచ్చిన వాఙ్మూలంలో తుడిచిపెట్టుకు పోయిందనీ....

నూరు ఆరైనా, ఆరు నూరైనా తన ఆస్తి ఆ పాతకికి మాత్రం దక్కకూడదనీ

తన యావదాస్తినీ నాకు తోచిన యే అనాధ శరణాలయం పేరైనా వ్రాసి విల్లును సిద్ధంచేసి మరునాడు అంటే ఈ రోజు రాత్రి అదే వేళకు ఆ పబ్లిక్ టెలిఫోన్ బూత్ దగ్గరకే వచ్చి తనను కలుసుకొమ్మని చెప్పారాయన.

కాని, ఇంతలోనే ఆయనను మృత్యువు కబళించివేస్తుందని కలలో కూడా ఊహించలేక పోయాను.”

బాధతో ముకుందరావు గొంతు గద్గదమయ్యింది.

అనునయంగా ముకుందరావు భుజాన్ని తట్టి బయటకు నడిచాడతడు.

నిజమే! యింక ఈ కేసులో యెవరికైనా ప్రశ్నించ డానికి ఏముంది గనుక!

ముకుందరావును కలుసుకోబోయే ముందే, బాలిస్టిక్, ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్సునుండి అతనికి రిపోర్టులందాయి.

'గుంచిలో నేప్‌కిన్‌తో చుట్టబడిన రివాల్వర్.... పాయింట్ త్రి, టు కాలిబర్ రకానికి చెందినదని, కోర్టులో కాల్చబడి, సుగుణ భుజంలోనుండి దూసుకు పోయిన బుల్లెట్ ఆ రివాల్వర్‌నుంచే కాల్చబడిందనీ' బాలిస్టిక్ ఎక్స్‌పర్టు రిపోర్టు యిచ్చాడు.

ఆ రివాల్వర్‌పై లభించిన వ్రేలిముద్రలు గోపాలరావు గారివేనని ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్టు రిపోర్టు యిచ్చాడు.

సో! హంతకుడు గోపాలరావేనని నిర్ధారణమైనట్లే!

మొదట హతుడు అంటోనీని చంపిన హంతకునిగా కోర్టులో నిరూపించబడిన గోపాలరావే రైలు ప్రమాదంలో హతునిగా మారాక....యిక కేసేముంది!

జస్టు ఒన్ కన్ క్లోజ్ దట్ ఫైల్ హేపీలీ! హాయిగా ఆ కేసు ఫైలును మూసేసి మూల పారేయవచ్చు.

ఆఫ్‌కోర్స్!

అది ఇన్‌స్పెక్టర్ జయంత్ కాకుండా మరో పోలీసు ఆఫీసరైనట్లయితే, ఖచ్చితంగా ఆ పని చేసి ఉండేవాడు.

అప్పుడు ఈ కథ ఇంతటితోనే ముగిసి ఉండేది!

9

"గేమ్!"

గొల్లుమని వినిపించిన అరుపులవి, డ్రాయింగ్ రూమ్ లోని ఈజీ చెయిర్‌లో కూర్చుని దీర్ఘాలోచనలో మునిగి ఉన్న ఇన్‌స్పెక్టర్ జయంత్ తలత్రిప్పి చూశాడు.

హాలులో కేరమ్స్ ఆడుకుంటున్న పిల్లలు ఆనందంతో కేరింతలు కొడుతున్నారు.

వారి వంక నవ్వుతూ చూశాడతడు.

చూపులు పిల్లలమీదున్నా, అతని మెదడులో మాత్రం ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

అతనికి యెదురుగా నున్న టేబిల్ పై మూసి, మూల పారేయాల్సిన సుగుణ కేసు ఫైలు తెరచి పెట్టబడి వుంది. అతడు ఆ కేసుయొక్క పూర్వాపరాలను సమీక్షించు కుంటున్నాడు.

'ఇనాళ్ళూ మౌనంగా శిక్షను అనుభవిస్తున్న సుగుణ మళ్ళీ తన కేసును కోర్టుకు అప్పీల్ చేసిందంటే, తాను నిర్దోషిగా నిరూపింపబడతానని ఆమెకు దృఢమైన నమ్మకం కలిగి ఉండాలి.

ఆమెకు అంతగా నమ్మకం కల్గించిన ఆ ఆధారం ఏమిటి?

ఏ సాక్ష్యాధారాలున్నా, సుగుణ ఏ వాఙ్మూలాన్ని యిచ్చినా, ఆ రోజు గోపాలరావు అలా కోర్టు హాల్లో ప్రత్యక్షం కాకుంటే, ఆమె నిర్దోషిగా నిరూపింపబడి ఉండేది కాదు.

అంటే, కేసు హియరింగ్ జరుగుతూ ఉండగా తన భర్త గోపాలరావు కోర్టు హాలులోనికి వస్తాడని ఆమెకు ముందే తెలిసి ఉండాలి.

ఎలా తెలుస్తుంది?

జైలు గోడల మధ్య శిక్షను అనుభవిస్తున్న ఒక ఖైదీకి, ఎప్పుడో ఎక్కడికో పారిపోయి అజ్ఞాతంగా జీవిస్తున్న గోపాలరావు ఉనికి ఎలా తెలుస్తుంది?

అంటే, ఎవరో అతని ఉనికి ఆమెకు చెప్పి ఉండాలి.

అంటే, జైలులోనున్న సుగుణకు ఎవరో కలిసి వుండాలి.

ఎవరు? ఎవరా వ్యక్తి?

ఆ వ్యక్తికి గోపాలరావు ఉనికి తెలిసి వుండాలి.

ఎక్కడో, ఏ మారుమూలో, ఎవరి కంటా పడకుండా అజ్ఞాతంగా బ్రతుకుతున్న గోపాలరావుకు—

తన భార్య సుగుణ కేసు మళ్ళీ కోర్టుకు అప్పీల్ చేయబడిందనీ, ఆ కేసు హియరింగ్స్‌లో ఆ రోజే తన భార్య తన క్రొత్త వాఙ్మూలాన్ని ఇవ్వబోతోందనీ అతనికి ఎలా తెలిసింది?

ముందుగా తెలియకుంటే, తన భార్యను హత్యచేయడానికి రివాల్వర్‌ను పట్టుకొని మరీ అతడు కోర్టుకు యెందుకు వస్తాడు? వచ్చాడంటే ఆ కేసుయొక్క పూర్తి వివరాలు అతనికి తెలిసి ఉండాలి!

తెలిసి ఉండాలంటే, ఎవరో అతనికి చెప్పివుండాలి. అతడిని కలసి ప్రోవోక్ చేసి ఉండాలి!

ఎవరు? ఎవరా వ్యక్తి?

అటు సుగుణకు ఒక వ్యక్తి సహకరించాడు. ఇటు గోపాలరావుకూ యింకొక వ్యక్తి సహకరించాడు.

"డబుల్ గేమ్!"

గొల్లున వినిపించిన పిల్లల అరుపులకు ఉలిక్కిపడ్డాడతడు.

"డబుల్ గేమ్!"

అప్రయత్నంగా అతని పదాలు ఉచ్చరించాయా పదాల్ని!

"య్యాస్! ఇట్స్ ఎ డబుల్ గేమ్! అటు సుగుణతోనూ, ఇటు గోపాలరావుతోనూ ఎవరో డబుల్ గేమ్ ఆడుతున్నారు.

అయితే ఈ గేమ్ వలన అతనికి వచ్చిన లాభం ఏమిటి? ఇంతవరకు జరిగిన సంఘటనల దృష్ట్యా ఈ కేసులో లాభం పొందుతున్నది ఒకే ఒక వ్యక్తి!

అది....సుగుణ!

గోపాలరావు కోర్టు హాల్లో ప్రత్యక్షం కావటంవలన ఆమె నిర్దోషిగా నిరూపింపబడింది. ఇప్పుడు గోపాలరావు ఏక్సిడెంట్‌లో మరణించాడు కాబట్టి అతని యావదాస్తీ ఆమెకే సంక్రమిస్తూంది.

అంతే!

ఆ ఆలోచన వచ్చిన మరుక్షణం యెవరో ఛెళ్ళున చెర్నాకోలతో చరిచినట్లయింది అతనికి.

కోర్టు హాల్లో కనిపించిన మరునాడే, గోపాలరావు ప్రమాదంలో మరణించడం కేవలం యాదృచ్ఛికమా?

లేక ఆ ప్రమాదం కల్పించబడిందా?

ఆస్తి కోసం గోపాలరావు హత్య చేయబడ్డాడా? ఏది నిజమో, ఏది అబద్ధమో తెల్సుకోలేని పరిస్థితి.

అయినా ఆ ఆలోచన వచ్చాక యింక తాపీగా కూర్చుని ఉండలేకపోయాడతడు. చివాలున కుర్చీలో నుంచి పైకి లేచాడు.

ఇప్పుడతని దృష్టి అంతా ఈ డబుల్ గేమ్‌ను ఆడుతున్న అజ్ఞాత వ్యక్తిపైనే ఉంది. ఎంత తెర వెనుకే ఉండి ఈ నాటకాన్ని ఆడిస్తున్నా, కనీసం జైలులో నున్న సుగుణను ఎప్రోచ్ కావడానికయినా ఆ వ్యక్తో, అతని అనుచరుడో రంగస్థల ప్రవేశం చేసివుండాలి!

'ఆ తీగెను పట్టుకోగల్గితే, ఈ డొంక అదే కదులుతుంది....' అనుకున్నాడతడు బయటకు అడుగులు వేస్తూ.

10

"చంపాలాల్ యేమంటున్నాడు లాయర్ గారూ!" తను సోఫాలో వయ్యారంగా వెనక్కి వాలుతూ అంది సుగుణ.

కొన్ని రోజుల క్రితం వరకూ, జైలులో ఒంటరిగా, దిగులుగా గడిపిన ఆ ఖైదీ సుగుణా, ఈ రోజు గోపాల రావు ఆస్తికి సర్వాధికారిణి అయిన లక్షాధికారి సుగుణా ఒక్కరేనంటే చూసేవారికి నమ్మబుద్ధి కాదు.

ఆమె మాటల్లో, ప్రవర్తనలో అంత మార్పు వచ్చింది. ఆస్తి తెచ్చిన అహం ఆమె అణువణువులో తొణికిస లాడుతూంది.

'ఇంతలో ఎంత హుందానీ. ఎంత దర్పాన్నీ ఒలక బోస్తూంది' అనుకున్నాడు ముకుందరావు.

"తొమ్మిది లక్షల వరకూ యిస్తానన్నాడు" అన్నాడతడు.

"ఇన్ని బేరాలు అనవసరం లాయర్ గారూ! పది లక్షలకు ఒక్క పైసా కూడా తగ్గేదిలేదు. అతడు కాదంటే మరో పార్టీని చూసుకుందాం!"

సంధ్యకిచ్చిన మాట ప్రకారం, ఆమెకివ్వాల్సిన పది లక్షల కోసం ఆస్తిలో కొంత భాగాన్ని బేరం పెట్టిందామె.

జైలులో తనను కలసినప్పుడు....

"జైలునుండి విడుదలయ్యాక నన్ను మోసం చేయాలనే ఆలోచన కలలో కూడా రానీయకు.

"జైలునుండి నిన్ను తప్పించగల్గుతున్న నేను, నిన్ను మళ్ళీ సులువుగా జైలుకు పంపించగలననే నూరు పైసల నిజం నీకు గుర్తుంటుందనే ఆశిస్తాను"—అంటూ సంధ్య

చేసిన హెచ్చరిక ఇంకా ఆమెకు గుర్తుంది.

పది లక్షల కోసం లోభపడి, మళ్ళీ జైలుపాలు కాదలచుకోలేదామె. అందుకే శేట్ చంపాలాల్‌కు తన ఆస్తిని అమ్మాలని చూస్తోందామె.

ఏదో చెబుదామని నోరు తెరిచిన ముకుందరావు ట్రేలో టీ కప్పులతో లోనికి వచ్చిన యువతిని చూసి ఆగిపోయాడు.

ఆ యింటిలోని పనిమనుషులంతా అతనికి తెలుసు. అయితే ఆ యువతిని మాత్రం అతనెప్పుడూ చూడలేదు. ఆమెవంక అనీజీగా చూశాడతడు.

అతని కళ్ళలోని ఆశ్చర్యాన్ని, అసహనాన్ని గమనించింది సుగుణ. చిన్నగా నవ్విందామె.

“రత్నం అని క్రొత్తగా పనిలో చేరింది లెండి. మంచి చురుకైన అమ్మాయి!” అందామె.

ట్రేలోని టీ కప్పులను టేబిల్‌పై ఉంచి, తల వంచుకొని బుద్ధిగా ఆ గదిలో నుండి వెళ్ళిపోయింది ఆ యువతి.

ఆమె వెళ్ళిపోయిన రెండు నిముషాల తరువాత.... “సరే! చంపాలాల్‌తో మాట్లాడుతాను సుగుణాదేవి!” అన్నాడు ముకుందరావు మెల్లగా.

సరేనన్నట్లు తలాడించింది ఆమె.

“ఇక వెళ్ళవస్తా” నంటూ ముకుందరావు కుర్చీలోంచి లేచాడు. మెల్లగా అడుగులు వేసుకుంటూ బయటకు నడిచాడు.

అతనివంకే చూస్తూ—

‘పనిమనిషి రత్నాన్ని చూసి లాయర్‌గారెందుకు ఉలిక్కిపడ్డారు చెప్మా!....’ అనుకుందామె ఆశ్చర్యంగా

ముకుందరావు వెళ్ళిపోయిన పది నిముషాల తరువాత, బురఖా ధరించిన ఒక ముస్లిం యువతి సుగుణను కలుసుకోవడానికి వచ్చింది.

ఆ యువతి గూర్చి పనిమనిషి రత్నం వచ్చి చెప్పగానే ఆలోచనలో పడిందామె.

'తనకు తెలిసినంతలో తనకు గాని, తన భర్తకు గాని ముస్లిం స్నేహితు లెవరూ లేరు. మరి ఎవరై ఉంటుంది ఈమె?' అనుకుందామె ఆలోచిస్తూ.

రత్న వెంట ఆ యువతి డ్రాయింగ్ రూమ్‌లోనికి ప్రవేశించింది. సుగుణ యెదురుగా నున్న సోఫాలో కూర్చుంది.

సుగుణకు అసహనంగా ఉంది.

'ఎవరు మీరు?' అన్నట్లు విసుగ్గా ఆ యువతి వంక చూసిందామె.

ఆ యువతి మెల్లగా తన తలపై నున్న ముసుగును తొలగించింది. ఆ యువతి వంక నమ్మలేనట్లుగా చూసిందామె.

"సంధ్యా! మీరా!" అందామె ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెడుతూ.

చిన్నగా నవ్విందామె.

అదే సమయంలో ఆ గదిలోనికి అడుగుపెట్టింది పనిమనిషి రత్నం. ఆమె చేతిలోని ట్రేలో రెండు ఆరంజ్ ఫ్లేవర్డు డ్రింక్స్‌తో నింపబడ్డ అందమైన పొడవాటి గాజు గ్లాసులున్నాయి.

సంధ్య పేరును వినడంతో నే ఆమె కళ్ళు విచిత్రంగా మెరిశాయి. డ్రింక్ గ్లాసులను టేబిల్ పై సర్దుతూ ఆ యువతివంక చూసిందామె.

'సందేహం లేదు ఆమే ఈమె!' అనుకుందామె ఖాళీ ట్రేను తీసుకొని గది బయటకు నడుస్తూ.

తనను యీ యింటికి పనిమనిషిగా పంపే ముందు ఇన్‌స్పెక్టర్ జయంత్ తనతో చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి ఆమెకు.

'జైలులో యెప్పుడూ ఒంటరిగానే గడిపేదట సుగుణ! ఎవరితోనూ కలిసేది కాదట! ఎవరితోనూ మాట్లాడేది కాదట!

కాని ఒకరోజు ఒక అపరిచిత యువతితో టిఫిన్ చేస్తూ చాలా సేపు మాట్లాడిందట!

కొద్దిరోజులలో ఆ యువతి విడుదల చేయబడింది. ఆమె విడుదలయిన రెండు రోజులలోనే సుగుణ కేసు కోర్టుకు అప్పీల్ చేయబడింది.

అంటే, సుగుణ కేసు కోర్టుకు అప్పీల్ చేయించడంలో ఖచ్చితంగా ఆ యువతి పాత్ర ఉండి ఉండాలి....!

నేను లాయర్ గణపతిరావును కలుసుకున్నాను. మొదట బుకాయించినా, తరువాత నిజం ఒప్పుకున్నాడు.

సుగుణ కేసును వాదించమని తనను యెవరో ఒక యువతి ఎప్రోచ్ అయిందని చెప్పాడతను.

జైలు రికార్డ్సులో నమోదయిన ఆ యువతి పేరు సంధ్య!

హా!

సుగుణను నిర్దోషిగా నిరూపించడానికి, ఈ ఆస్తి ఆమెకు దక్కేట్టు చేయడానికి ఆడబడుతున్న ఈ అంతర్నాటకంలోని ముఖ్య పాత్రధారి అయిన ఈ సంధ్య

అనే యువతి....యీ నాటకం ద్వారా యేదో ఆశి స్తోంది!

ఈ నాటకానికి సూత్రధారి. సుగుణా? సంధ్యా? లేక మరొకరా? అన్నది తేలాలంటే సంధ్యనూ, సుగుణనూ ఒక కంట కనిపెట్టాలి. వారి ప్రతి చర్యా, వారు మాట్లాడుకొనే ప్రతి మాటా మనకు తెలిసితీరాలి!

అంటే మనం కోటలో పాగా వేయాలి!"

తమ ప్రయత్నం వట్టిపోనందుకు, పట్టలేనంత సంతోషంగా వుంది ఆమెకు. గుండెల్లో ఉబుకుతున్న ఉత్సాహాన్ని అదిమిపెట్టి మెల్లగా తన గదిలోనికి నడిచిందామె.

తన చలాకీతనంతో, వచ్చిన రెండు రోజులలోనే సుగుణ మనసును ఆకట్టుకుందామె. తన కెవరూ లేరని చెప్పటంచేత ఆ భవంతిలోనే చిన్న గదిని రత్నం ఉండటానికి కేటాయించింది సుగుణ.

ఆ గదిలోకి ప్రవేశించి తలుపులు మూసి, లోపలినుండి గడియ పెట్టింది. ఆ గదిలో ఓ మూల నున్న చిన్న రేకు పెట్టెను పైకి తీసింది. పెట్టె మూతను తెరిచింది. అందులో నున్న సామగ్రి వంక తృప్తిగా చూసింది.

ఆ పెట్టెలో చిన్న టేప్ రికార్డర్ వంటి సాధనం ఉంది. దానికున్న రెండు సన్నని వైర్లు ఒక హెడ్ ఫోన్‌కు కనెక్టు చేయబడి ఉన్నాయి. రికార్డర్ స్విచ్‌ను ఆన్ చేసిందామె. ఆ రికార్డర్‌లోని పెద్ద స్పూల్ మెల్లగా తిరగసాగింది.

అక్కడ ...డ్రాయింగ్ రూమ్‌లో ఫ్లవర్ వేజ్ మధ్య ఆమె ముందే అమర్చి ఉంచిన హియరింగ్ బగ్ ద్వారా....సుగుణ, సంధ్యలు మాట్లాడుకుంటున్న ప్రతి

మాట హెడ్‌ఫోన్స్ గుండా ఆమె చెవులకు చేరుతున్నాయి. ఆ క్షణంలో ఆ మాటలన్నీ స్పూల్‌లో రికార్డు కాసాగాయి.

"బేరం ఈ రోజో, రేపో సెటిల్ అవుతుంది సంధ్యా! ఆ సొమ్ము చేతికి రాగానే, మీకు యిచ్చిన మాట ప్రకారం ఆ పదిలక్షలు మీకు అందజేస్తాను.

కాని...." అంటూ సందిగ్ధంగా ఆగింది సుగుణ.

"కాని....!" అదే మాటను రిపీట్ చేస్తూ, నొసలు చిట్లించి, ప్రశ్నార్థకంగా చూసింది సంధ్య.

"ఆ పదిలక్షలు మీ చేతికి రావాలంటే నా కోసం మరో పని చేయాల్సి ఉంటుంది."

"ఏమిటది?" అసహనంగా అడిగింది సంధ్య.

"నాకు ఒక వ్యక్తి వివరాలు కావాలి. అతడిప్పుడు యెక్కడున్నాడు? యేం చేస్తున్నాడు? యిన్నాళ్ళూ యెక్కడ యెలా గడిపాడు?—ఆ వివరాలను మీరు నాకు సంపాదించి పెట్టాలి!"

"ఎవరా వ్యక్తి....?" అసహనంగా అడిగింది సంధ్య.

ఒకసారి తల వాల్చి మెల్లగా...."ఆంటోనీ!" అంది సుగుణ.

"నిక్కీ! యూ మీన్ దట్ నికల్సన్!" అంటూ పక పకా నవ్వసాగింది సంధ్య.

ఆశ్చర్యంగా ఆమెవంక చూసింది సుగుణ. తన ప్రియుడు ఆంటోనీ పూర్తి పేరు ఆంటోనీ నికల్సన్ అని ఆమెకు తెలుసు. కాని, ఆంటోనీ నికల్సన్‌ను 'నిక్కీ' అని పిలవగలిగేంతటి చనువు ఆంటోనీ వద్ద సంధ్యకు యెలా యేర్పడింది?—అదీ ఆమె ఆశ్చర్యానికి కారణం.

'ఏమిటి వారిద్దరి మధ్య నున్న సంబంధం? తనకూ, అంటోనీకి మధ్య నున్న సంబంధ మేనా?' ఆ పైన ఆలోచించలేక అసహనంగా తల విదిలించిందామె.

"ఏం? పాత ప్రియునిమీద మనసు పోతూందా సుగుణా?" చిన్నగా నవ్వుతూ అంది సంధ్య.

ఒకసారి చురుగ్గా, చిరాకుగా ఆమెవంక చూసింది సుగుణ. "కాదు!" అంది దృఢంగా.

'మరి యెందు కన్నట్లు?' ప్రశ్నార్థకంగా కనుబొమ్మలను ఎగుర వేసింది సంధ్య.

"మాచే హత్య కావింపబడిన నాభర్త గోపాలరావులా వేషం వేసుకున్న మరో వ్యక్తిని కోర్టు హాల్లో ప్రత్యక్షం చేయించారు. నాభర్త యింకా సజీవుడేనని కోర్టును నమ్మించారు. నన్ను నిర్దోషిగా విడుదల చేయించారు.

ఎవరో అనామకుని శవాన్ని చూపి, రైలు ప్రమాదంలో నాభర్త గోపాలరావు ప్రమాదవశాత్తు మరణించినట్లు సాక్ష్యాధారాలను సృష్టించారు. నాభర్త ఆస్తి నాకు సంక్రమించేందుకు సహకరించారు.

అంతా మీరనుకున్నట్లుగానే సవ్యంగా జరిగింది. కాని ..."—అంటూ అర్ధోక్తిలో ఆపింది సుగుణ.

"కాని, యింకే మొచ్చింది?" అంది సంధ్య అసహనంగా.

చిన్నగా నవ్వింది సుగుణ.

"ఇన్ని జాగ్రత్తలు తీసుకున్న మీరు ఒకే ఒక్క విషయాన్ని నిర్లక్ష్యం చేశారు సంధ్యా!

నిజానికి నాభర్త ముఖాన్ని దిండులో అదిమి, ఊపి

రాకుండా చేసి, హత్య చేసింది నేను కాదు. ఆంటోనీ. నేను కేవలం నా భర్త కాళ్ళూ, చేతులూ కదపకుండా గట్టిగా పట్టుకున్నానంతే!

ఈ రోజు కోర్టు నన్ను నిర్దోషిగా తీర్పునిచ్చి విడుదల చేసినా, అసలు హంతకుడు ఆంటోనీ బ్రతికున్నంత వరకూ ఈ కేసు పూర్తిగా మాసిపోనట్లేగా!"

ఆమె మాటలకు పక పకా నవ్వింది సంధ్య.

"ఆ మాత్రం మేం ఊహించలేదంటావా సుగుణా? ఆంటోనీ గూర్చి నీకే చింతా వద్దు!"

అర్థం కానట్టు చూసింది సుగుణ మరోసారి సన్నగా నవ్వింది సంధ్య.

"నీ భర్త గోపాలరావులా కోర్టు హాల్లో ప్రత్యక్షమయింది ఎవరనుకుంటున్నావ్?

"నీ మాజీ ప్రియుడు ఆ టోని!

రైలుపట్టాల పై మాంసపు ముద్దలా కనుగొనబడిన ఆ శవం. నీ భర్త గోపాలరావుదేనని పోలీసులను సైతం నమ్మించిన ఆ శవం ..ఎవరిదో అనామకుడిది కాదు!.... ఆంటోనీది!"

నమ్మలేనట్లు చూసింది సుగుణ! ఆ గదిలో గాలి కూడా ఒక్క క్షణం పాటు స్తంభించి నట్లనిపించింది ఆమెకు.

హెడ్‌ఫోన్స్ ద్వారా వారి మాటలను ఆలకిస్తున్న రత్నం గొంతులోని తడి ఆరిపోయింది.

అందంగా అమాయకంగా కనిపించే ఈ యువతులలో యింతటి రాక్షసత్వం దాగివుందంటే—నమ్మ బుద్ధి కావటంలేదు ఆమెకు.

కాని నమ్మకుండా ఎలా ఉండగలదు?

కేవలం డబ్బుకోసం తాళికట్టిన భర్తనూ, కోరుకున్న ప్రియుడ్ని దారుణంగా చంపిన యిద్దరు యువతులు.... ఆ ప్రక్క గదిలోనే హాయిగా నవ్వుకుంటూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

వారిని చూస్తూ వారి మాటలను వింటూ కూడా ఎలా నమ్మకుండా ఉండగలదు ఆమె!

11

రాత్రి పన్నెండు గంటలు కావస్తోంది. కృష్ణపక్షపు రోజులు కావటంచేత చీకటి చిక్కగా అలుముకుంది.

డ్రయివ్ చేస్తున్న కారును స్లో చేసింది సుగుణ. కారు హెడ్‌లైట్ల కాంతిలో పచ్చగా మెరుస్తోంది రోడ్డు ప్రక్కగా ఆర్ అండ్ బి వారు పాతిన మైలు రాయి. దానిపై నల్లని రంగులో పెయింట్ చేయబడ్డ పదిహేను అన్న సంఖ్య కొట్టవచ్చినట్లు కనిపిస్తూంది.

ఆ మైలురాయి ప్రక్కనుండి ఒక మట్టిబాట కనిపిస్తోంది. కారును మెల్లగా టర్న్ చేసి ఆ మట్టిబాట పైకి పోనిచ్చిందామె.

ఆ బాట కిరువైపులా జీబురుగా పెరిగిన చెట్లు ఆ ప్రదేశాన్ని మరింత చీకటి చేస్తున్నాయి. ఏదో పక్షి వికృతంగా అరుచుకుంటూ కారు పైగుండా ఎగురుకుంటూ పోయింది.

సీటు పైనున్న తోలుపెట్టెవంక చూసిందామె. అందులో చంపాలాల్ కు ఆస్తిని అమ్మగా వచ్చిన పది లక్షల కరెన్సీ నీట్ గా పేర్చబడి వుంది.

సహజంగా ఎంతో ధైర్యవంతురాలయిన సుగుణకు కూడా, ఆ చీకటిలో అంత సొమ్ముతో, ఒంటరిగా ప్రయాణం సాగించటం కాస్త భయాన్ని కల్గించ

సాగింది.

పమిట చెంగు చాటున, బొడ్లో దోపుకున్న రివాల్వర్ ను ఒక్కసారి తడిమి చూసుకుందామె. చల్లని ఆ రివాల్వర్ చల్లగా చేతికి తగిలేసరికి ఆమెలో భయం కాస్త తగ్గింది.

ఆమె ఏకాగ్రతతో డ్రయివ్ చేస్తోంది. సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఆ బాటలో ప్రయాణించి ఉంటుందామె. రోడ్డు కిరువైపులా దట్టమయిన జీడి తోపు ప్రారంభమయింది. ఆ తోపువంక సాలోచనగా చూసిందామె.

అదే సమయంలో....

ఆ తోపులోని ఓ మూల....పారతో నేలను త్రవ్వుతున్నాడొక వ్యక్తి. చెమటతో అతని వళ్ళు పూర్తిగా తడిసి ఉంది. ఆయాసంతో బరువుగా ఊపిరి తీస్తున్నాడతడు. అయినా త్రవ్వటం ఆపటంలేదు. నిర్విరామంగా పారతో మట్టిని తీసి ప్రక్కకు వేస్తూనే ఉన్నాడు.

'మరి కొద్ది నిముషాల్లో పదిలక్షల రూపాయలు తన స్వంతం కాబోతున్నాయన్న ఆనందం' అతనికి ఎక్కడలేని ఉత్సాహాన్ని కలుగజేస్తోంది.

మరి కొద్ది నిముషాలలో అతడు త్రవ్వటం పూర్తి చేశాడు. గోతిలోనుండి బయటకువచ్చి నిలబడ్డాడు. ఒక్కసారి తను త్రవ్విన గోతి వంక సంతృప్తిగా చూస్తున్నాడు.

అరడుగుల పొడవు, మూడడుగుల వెడల్పు, నాలుగడుగుల లోతులతో, ఎరను మ్రింగడానికి సిద్ధంగా నోరు తెరచుకొని కూర్చున్న కొండచిలువలా ఉంది ఆ గొయ్యి.

ఒక వికృత హాసంతో అతని పెదవులు మెల్లగా విచ్చుకున్నాయి చేతికి అంటిన మట్టిని దులుపుకుంటూ మెల్లగా ఆ తోపులోనికి నడిచాడతడు.

అక్కడ....

డ్రయివ్ చేస్తున్న కారును టక్కున ఆపింది సుగుణ. ఎదురుగా రోడ్డు ప్రక్కనున్న చెట్టుక్రింద నిలబడి ఉంది ఒక యువతి.

ఆమె మెల్లగా రోడ్డుపైకి వచ్చింది. ఇప్పుడు కారు హెడ్ లైట్స్ కాంతిలో ఆమె స్పష్టంగా కనిపిస్తోంది.

ఆమె....సంధ్య!

కారు డోరు తెరచుకొని సుగుణ క్రిందకు దిగింది వారిద్దరూ ఒకరినొకరు సాభిప్రాయంగా చూసుకున్నారు. అంతే!

కారులోనున్న లెదర్ సూట్ కేసును సంధ్యకు అందించిందామె. ఒక్కసారి ఆ పెట్టెమూత తెరచి చూసుకొంది సంధ్య. తరువాత ఇద్దరూ సాదరంగా షేక్ హాండ్స్ యిచ్చుకొని విడిపోయారు.

కనీసం ఒక్కమాట కూడా మాట్లాడుకోలేదు వారు. నిజానికి మాట్లాడుకోవడానికి ఏమీ లేదు కూడానూ!

ఆ క్షణంతో వారిద్దరి మధ్యానున్న ఒప్పందం పూర్తయింది. ఆ క్షణంనుండీ ఆమె ఎవరో ఈమెకు తెలియదు. ఈమె ఎవరో ఆమెకు తెలియదు. వారు ఒకరి గురించి మరొకరు పూర్తిగా మరచిపోవాలి!

అదీ వారి క్రొత్త ఒప్పందం! తమ ఒప్పందాన్ని వారు ఆ క్షణం నుండే సిన్సియర్ గా పాటించారు.

సూట్ కేసును చేతో పట్టుకొని, మెల్లగా నడుచుకుంటూ ఆ తోపులోనికి వెళ్ళిపోయింది సంధ్య. ఆమె

కనుమరుగయ్యేంత వరకూ చూసి, మెల్లగా కారువైపు నడిచింది సుగుణ.

కారును సమీపించి, కారు డోర్‌పై చేయి వేసింది. అంతలో ఏదో చల్లగా ఆమె మెడకు తగిలింది. ఉలిక్కిపడి చూసిందామె.

ఎదురుగా చేతిలో రివాల్వర్‌తో చిరునవ్వులు చిందిస్తూ నిలుచున్న యువతి వంక నమ్మలేనట్లు చూసింది.

"నీవా!" అందామె ఆశ్చర్యంగా.

అక్కడ....

ఎదురుగా నడుచుకుంటూ వస్తున్న అతనివంక ఉత్సాహంగా చూసింది సంధ్య. అతని చూపులు ఆమె చేతిలోని సూట్‌కేసుపై పడ్డాయి. ఆనందంతో అతని ముఖం విప్పారింది.

"వుయ్ గాటిట్ బాస్! వుయ్ గాటిట్!"—ఒక్క పరుగున అతన్ని సమీపించి, ఆనందంతో అతన్ని అల్లుకు పోయిందామె.

ఒక చేత్తో ఆమె చేతిలోని సూట్‌కేసును అందుకొని మరో చేతిని ఆమె నడుం చుట్టూ వేసి, వాత్తుకొని ఆమెను మెల్లగా నడిపించసాగాడతడు.

గాలిలో తేలిపోతున్నట్లుగా వుంది ఆమెకు. తాము అనుభవింపబోయే అరిస్టోక్రాటిక్ లైఫ్ గూర్చి కలలు కంటూ, అతని గుండెలపై తలవాల్చి, అన్నీ మరచి మైమరపుతో అడుగులు వేస్తూంది ఆమె.

ఆ మైమరపులో తామెక్కడకు వచ్చిందీ కూడా గమనించలేదామె. మెత్తని ఇసుకలో పాదాలు కూరుకు పోయే సరికి ఉలిక్కిపడిందామె.

ఎదురుగా ఆరడుగుల గొయ్యి!

అదే క్షణంలో విసురుగా ఆమెను గోతిలోనికి త్రోశాడతడు. గోతిలో వెల్లకిలా పడిన ఆమె వంక చూస్తూ క్రూరంగా నవ్వాడతడు. అతని చేతిలోని రివాల్వర్ ఆమె వంక ఆకలిగా చూస్తూంది.

రివాల్వర్‌ను చూస్తూనే రక్తం యింకిపోయినట్లుగా తెల్లగా పాలిపోయింది ఆమె ముఖం. భయంతో ఆమె పెదిమలు వణుకుతున్నాయి.

"సారీ సంధ్యా!

నిన్ను చంపక తప్పటంలేదు.

ఈ నాటకంలో తెరమీద కన్పించిన పాత్రవు నీవు. తెర వెనుక సూత్రధారిని నేను!

కాని, ఆ నిజం బయటపడకుండా ఉండాలంటే- ఆ నిజాన్ని తెలిసిన నీవు. ఆ నిజంతో పాటు శాశ్వతంగా సమాధి కాక తప్పదు!"

అంటూ చేతిని ముందుకు సాచాడు అతడు. రివాల్వర్ ట్రిగర్ పై అతని చూపుడు వేలు బిగుసుకుంటోంది.

అక్కడ....

"నీవా రత్నం!" అందామె ఆశ్చర్యంగా.

"నే....ఇన్ స్పెక్టర్ రత్నమాలా! సుగుణా!" అంది రత్నం చిన్నగా నవ్వుతూ.

కరెంట్ షాక్ కొట్టినట్లనిపించింది ఆమెకు. ఆ నిజాన్ని జీర్ణం చేసుకొనేలోగానే రత్నమాల చెప్పటం ప్రారంభించింది.

"జరిగినదంతా మాకు తెలుసు సుగుణా! ఆ నిజాల్ని గ్రహించటానికే.... నేను మీ దగ్గర పనిమనిషిగా చేరినది.

ఆ రోజు మీరూ, సంధ్యా మాట్లాడుకున్న ప్రతి

అక్షరమూ రికార్డు చేయబడింది. నా యూ కాన్ట్ ఎస్కేప్ ఫ్రం ద కోర్టు ఆఫ్ లా.

కావాలనుకుంటే మిమ్మల్నిద్దరినీ ఆక్షణమే అరెస్టు చేసి ఉండేవారం. కాని ఈ నాటకాన్ని ఆడిస్తున్న అసలు సూత్రధారి కోసం యిన్నాళ్ళూ ఆగాల్సి వచ్చింది!"

తన చుట్టూ ఉన్న ప్రపంచం ఒక్కసారిగా గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది సుగుణకు. మళ్ళీ తన బ్రతుకు జైలుపాలేనన్న నిజాన్ని తట్టుకోలేక, అక్కడే కుప్పకూలి పోయిందామె.

అక్కడ....

"ముకుందరావ్!" పిచ్చిదానిలా గట్టిగా అరిచింది సంధ్య. "నన్ను చంపి నీవు తప్పించుకోలేవు ముకుంద రావ్! నీవు ఊహిస్తున్నట్లుగా ఆ నిజం నాతో పాటు సమాధి కాదు. నీకు సంకెళ్ళు వేయించి ఉరికంబానికి ఎక్కిస్తుంది."

మ్లానమైన ముఖంతో ఆమెవంక బెదురుగా చూశాడతడు'

హేళనగా నవ్విందామె.

"ఆ రోజు రాత్రి....

గోపాలరావు రూపంలో నున్న ఆంటోనీని రైలు పట్టాలకాడ నీవు హత్యచేసి, ఆ శవాన్ని చితుకగొట్టి, పట్టాలకు అడ్డంగా పడేయటాన్ని రహస్యంగా ఫోటోలు తీశాను నేను.

అవి.... నా ఫ్రెండ్ దగ్గర భద్రంగా ఉన్నాయి. రెండురోజులు కనుక నేను వరుసగా ఆమెను కలియకుంటే, ఆ ఫోటోలను పోలీసులకు అందజేయమని చెప్పి

ఉంచాను నేను.

నీ వెంత దుర్మార్గుడివో నాకు తెలుసు ముకుందరావ్! అవసరం తీరాక అంటోనీని అమానుషంగా హత్య చేసిన నీవు, ఆ రహస్యం తెలిసిన నన్ను మాత్రం విడిచిపెడతా వన్న నమ్మకం ఏమిటి?

అందుకే నీ బ్రతుకును బ్రోచెప్పే ట్రంపు కార్డును నా దగ్గరుంచుకున్నాను. మర్యాదగా మన ఎగ్రిమెంటు ప్రకారం నా అయిదు లక్షలనూ నాకు పంచియివ్వు. లేదంటే....”—అంటూ అర్ధోక్తిలో ఆపి చిన్నగా నవ్విందామె.

ఆమె మాటలకు నల్లగా మాడిపోయింది అతని ముఖం. “యూ బ్లడీ బిచ్!” అనుకుంటూ కసిగా పళ్ళు కొరుక్కున్నాడతడు.

అదే క్షణంలో రెండు శక్తివంతమైన సెర్చిలైట్ల కాంతి వారిమీదకు ప్రసరించింది.

“డ్రాప్ ద రివాల్వర్ ముకుందరావ్! నో యూ కాన్ట్ ఎస్కేప్!”—ఖంగుమని వినిపించిన కంఠధ్వని వంక కంగారుగా చూశారు వారు.

పది అడుగుల దూరంలో నున్న పొదల చాటునుండి మెల్లగా అడుగులు వేసుకొంటూ తమని సమీపిస్తోన్న ఇన్ స్పెక్టర్ జయంత్ వంక తెల్లబోతూ చూశారు వారు. ఇన్ స్పెక్టర్ చేతిలో కొట్టవచ్చినట్లు కన్పిస్తోన్న టేప్ రికార్డర్ను చూసేసరికి అతని నరనాడులూ క్రుంగి పోయాయి.

తప్పించుకొని పారిపోదామన్న ఆలోచన ఏమయినా వారిలో మిగిలి ఉంటే....అది కాస్తా....

రైఫిల్స్ను బారు చేసుకుని పొదలను ముట్టుకుంటూ

తనను చుట్టుముడుతున్న పోలీసుల్ని చూసేసరికి అంత రించిపోయింది.

అతని ప్రమేయం లేకుండానే ముకుందరావ్ చేతిలోని రివాల్వర్ నేలకు జారిపోయింది.

చేష్టలు దక్కి వెర్రిదానిలా ఆ గోతిలోనే శూన్యంలోకి చూస్తూ నిలుచుండిపోయింది సంధ్య.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ జయంత్ కంఠం కంచులా మ్రోగింది.

"నేను మొదటి నుండీ ఈ నాటకం వెనుక యెవరో ఒక సూత్రధారి ఉన్నాడని అనుమానిస్తూనే వచ్చాను.

ఆ రోజు.... కోర్టులో....

సుగుణ పేరున తన యావదాస్తినీ ఆమె భర్త వీలునామా వ్రాసినట్లు, ఆమె భర్త మరణించినంత వరకూ ఆమెకు తెలియదని—మీరు సాక్ష్యం యిచ్చినప్పుడే మిమ్మల్ని అనుమానించాను.

రైలు పట్టాలపై శవం లభించిన ముందురోజు రాత్రి గోపాలరావుగారు మీకు ఫోన్ చేశారని, మిమ్మల్ని కలిసి విల్లుమార్చమన్నారని, పాత విల్లు నకలును ఆయనకు మీరందజేశారనీ—మీరు నాతో చెప్పినప్పుడు ఆ అనుమానం మరింత బలపడింది.

రైలుపట్టాలపై ప్రమాదంలో గోపాలరావు మరణించినట్లుగా నన్ను నమ్మించడానికి ప్రయత్నించారు మీరు. ఏమిటి మీకు ఇందులో లాభిస్తున్నదని ఆలోచించాను నేను. అనుమానం మీపై స్థిరపడినా మిమ్మల్ని దోషిగా నిరూపించడానికి సాక్ష్యాధారాలు కావాలిగా!

అందుకే ఇంతకాలం వేచి వున్నాను."

—అప్పై ఇన్స్పెక్టర్ చెబుతున్న మాటలేవీ అతనికి

వినిపించలేదు.

అతనికి తెలిసిపోయింది. అంతటితో తమ నాటకానికి తెర పడబోతుందని.

'నేరస్థుడు యెంత తెలివైన వాడైనా యెప్పుడో, ఒకప్పుడు చట్టానికి దొరక్కపోడు ముకుందరావ్!' సంకెళ్ళతో అతని చేతులను బంధిస్తూ అన్నాడు ఇన్‌స్పెక్టర్ జయంత్.

—: అయిపోయింది :—